ప్రజా
# రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం

RNI No:/2023/87888



పాత్రికేయులు కావలెను

తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న ప్రజా రిపబ్లిక్ తెలుగు దినపత్రికలో తెలుగు రాష్ట్రాలలో బ్యూరోలు, జిల్లా స్టాపర్లు, నియోజకవర్గ మరియు మండల స్థాయి పాత్రికేయులు కావలెను.

ఆసక్తి గలవారు సంప్రదించండి
9948814188 9985876888



Published From Nandyal : Cerculated in Nandyal,Kurnool,Kadapa,tirupathi,Prakasam, Krishna,Guntur,Nellore and All Distircts

సంపుటి - 02 సంచిక -296 | పేజీలు - 8 వెల - 03/- | మంగళవారం 10 ఫిబ్రవరి 2026





# స్వర్ణాంధ్ర 2047 లక్ష్యాలు సాధించాలి




**స్వర్ణాంధ్ర 2047 విజన్ లక్ష్యాలు సాధించాలి**

**అట్టడుగు వర్గాలకు ప్రభుత్వ పథకాలు**

**క్వాంటమ్ కంప్యూటర్లు ఎగుమతి చేసే స్థాయికి ఏపి**

**జిల్లాస్థాయిలో కలెక్టర్లు, మంత్రులు సమన్వయంతో సాగాలి**

**అధికారులు, కార్యదర్శులు, మంత్రులతో సిఎం చంద్రబాబు**



**అమరావతి,ఫిబ్రవరి 9 (రిపబ్లిక్ న్యూస్)**
ప్రభుత్వ పథకాలను అట్టడుగు వర్గాలకు కూడా చేరవేయాలని ఏపీ సీఎం చంద్రబాబు ఆదేశించారు. సచివాలయంలో మంత్రులు, వివిధ శాఖల కార్యదర్శులతో సీఎం సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు వర్చువల్‌గా పాల్గొన్నారు. జీఎస్‌డీపీ వృద్ధిరేటు, స్వర్ణాంధ్ర 2047 విజన్ లక్ష్యాలు, పది సూత్రాల అమలు, ఆదాయార్జన శాఖలు, రాష్ట్రానికి వచ్చిన పెట్టుబడులు, పీపీపీ ప్రాజెక్టుల పురోగతిపై సీఎం సమీక్షించారు. రియల్‌టైమ్ గవర్నెన్స్‌లో భాగంగా సాంకేతికతతో పాటు అవేర్, డేటా లీక్, పాలనలో ఏఐ టూల్స్ వినియోగం, కేంద్ర ప్రాయోజిత పథకాలమిగతా 2లో...

## ముదురుతున్న లోక్‌సభ వివాదం



**లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాపై అవిశ్వాస తీర్మానానికి సిద్ధమైన విపక్షాలు**

**ప్రధానిపై దాడి జరగొచ్చన్న స్పీకర్ వ్యాఖ్యలతో రాజుకున్న వివాదం**

**8 మంది కాంగ్రెస్ ఎంపీల సస్పెన్షన్‌తో మరింత పెరిగిన రాజకీయ వేడి**

కేంద్ర ప్రభుత్వం, ప్రతిపక్షాల మధ్య తీవ్రమవుతున్న విభేదాల నేపథ్యంలో లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టేందుకు విపక్షాలు సిద్ధమవుతున్నాయి. పార్లమెంట్ సమావేశాల్లో చోటుచేసుకుంటున్న వరుస పరిణామాలు, ఇరుపక్షాల మధ్య అపనమ్మకం ముదరడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది.మిగతా 2లో...

## విజయానికి క్రమశిక్షణే పునాది



- 'పరీక్షా పే చర్చ'లో దేశ నిర్మాణంపై విద్యార్థులకు మోదీ పాఠాలు
- వికసిత భారత్ గురించి విద్యార్థులు ఆలోచించడంపై ప్రధాని మోదీ హర్షం
- అన్నం వృథా చేయకపోవడం దేశ నిర్మాణంలో భాగమేనని సూచన
- 'పరీక్షా పే చర్చ'లో విద్యార్థులతో ముచ్చటించిన ప్రధాని మోదీ

10, 12వ తరగతి విద్యార్థులు ఇప్పటి నుంచే 'వికసిత భారత్' నిర్మాణం గురించి ఆలోచిస్తుండటం పట్ల ప్రధాని నరేంద్ర మోదీ హర్షం వ్యక్తం చేశారు. కేవలం పరీక్షలకే పరిమితం కాకుండా దేశ భవిష్యత్తు లక్ష్యాలపై యువత దృష్టి సారించడం గొప్ప విషయమని ఆయన అన్నారు. ఇవాళ 'పరీక్షా పే చర్చ 2026' రెండో ఎపిసోడ్‌లో భాగంగా ఆయన దేశవ్యాప్తంగా విద్యార్థులతో ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో తమిళనాడులోని మిగతా 2లో...

## నియోజవర్గాల్లోని స్థితిగతులపై ర్యాంకింగ్స్

**టాప్‌లో విజయవాడ పశ్చిమ**

**హిందూపురం-5, పిఠాపురం-10**

**టాప్-13లోనూ లేని కుప్పం, మంగళగిరి**

**చిట్టచివరి స్థానంలో గుంటూరు పశ్చిమ**

**ప్రగతి నివేదిక విడుదల చేసిన చంద్రబాబు**



## డిజిటల్ మోసాల పై సుప్రీం ఆగ్రహం

**సైబర్ దోపిడీ ద్వారా రూ.54 వేల కోట్లు స్వాహా**

**చిన్న రాష్ట్రాల బడ్జెట్‌తో సమానం**

**పరిహారానికి ప్రణాళిక రూపొందించాలి**

**ఆర్బీఐకి న్యాయస్థానం ఆదేశం**



న్యూఢిల్లీ :
సైబర్ దోపిడీ (డిజిటల్ మోసాల) ద్వారా రూ.54 వేలకోట్లకు పైగా స్వాహా కావడంపై సుప్రీంకోర్టు సోమవారం ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇది 'దోపిడీ, దొంగతనం'గా అభివర్ణించింది. సైబర్ మోసాలపై ఆర్బీఐ, బ్యాంకులు, టెలీకమ్యూనికేషన్ శాఖ (డీఓటీ)తో సంప్రదించి నాలుగు వారాల్లోగా ప్రామాణిక ఆపరేటింగ్ (ఎస్ఓటీ) ఫ్రేమ్‌వర్క్‌ను రూపొందించాల్సిందిగా కేంద్రాన్ని సుప్రీంకోర్టు ఆదేశించింది.
మిగతా 2లో...

## అంబటి రాంబాబుకు బెయిల్ అయినా జైలుకే!

**సీఎంపై వ్యాఖ్యల కేసులో అంబటి రాంబాబుకు బెయిల్**

**విడుదలవుతున్న సమయంలోనే మరో కేసు తెరపైకి**

**పోలీసులతో దురుసు ప్రవర్తన కేసులో 14 రోజుల రిమాండ్**

**ఈ నెల 22 వరకు అంబటికి జ్యుడీషియల్ కస్టడీ**

**తిరిగి రాజమహేంద్రవరం జైలుకే అంబటి**



**అమరావతి,ఫిబ్రవరి 9 (రిపబ్లిక్ న్యూస్)**
వైసీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబుకు ఒక కేసులో ఊరట లభించినా, ఆయన జైలు నుంచి ఇప్పట్లో విడుదలయ్యే అవకాశం కనిపించడం లేదు. సీఎం చంద్రబాబుపై అనుచిత వ్యాఖ్యలు చేశారన్న కేసులో గుంటూరు స్పెషల్ మొబైల్ కోర్టు

## క్షేత్రస్థాయిలో ఉదాసీనత పనికిరాదు

**ఎవరి బాధ్యతలు వారు సక్రమంగా నిర్వహించాలి**

**అప్పుడే ఆశించిన ఫలితాలను సాధిస్తాం**

**అధికారులకు డిప్యూటీ సిఎం పవన్ కీలక సూచనలు**



**అమరావతి,ఫిబ్రవరి 9 (రిపబ్లిక్ న్యూస్)**
క్షేత్రస్థాయిలో అధికారులు ఉదాసీనంగా వ్యవహరించవద్దని డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ అధికారులకు సూచించారు. క్షేత్రస్థాయి నుంచి పైస్థాయి అధికారి వరకు ఎవరికి వారు సక్రమంగా బాధ్యతలు నిర్వర్తించాల్సిందేనని చెప్పారు. సచివాలయంలో సీఎం చంద్రబాబు అధ్యక్షతన వివిధ శాఖల కార్యదర్శులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో పవన్ పాల్గొని మాట్లాడారు.
తాము నాలుగు గోడల మధ్య కూర్చునే వ్యక్తులం కాదని పవన్ అన్నారు. అంతా అద్భుతంగా ఉందని చెబుతున్నా.. కొన్నిచోట్ల గ్యాప్స్ ఉన్నాయని వ్యాఖ్యానించారు.మిగతా 2లో...

## మూగబోయిన మైకులు

**రేపే 7 కార్పొరేషన్లు, 116 మున్సిపాల్టీల్లో ఎన్నికలు**

**ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ ఫిబ్రవరి 13న ఓట్ల లెక్కింపు**

హైదరాబాద్**ఫిబ్రవరి 9 (రిపబ్లిక్ న్యూస్)**
తెలంగాణ మున్సిపల్ రెండో సాధారణ ఎన్నికల ప్రచారం సోమవారం సాయంత్రం ముగిసింది. ఆరు రోజుల పాటు మోగిన మైకులు మూగబోయాయి. ఈనెల 11న రాష్ట్రంలోని 116 మున్సిపాల్టీలు, 7 కార్పొరేషన్లకు పోలింగ్ జరగనుంది. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్, 13న ఓట్లను లెక్కిస్తారు. పోలింగ్‌లో ఏవైనా అవాంతరాలు జరిగితే 12నమిగతా 2లో...





## బర్డ్ ఫ్లూ కలకలం.. 24వేల కోళ్ల మృతి

**అన్నమయ్య జిల్లాలోమూడు గ్రామాల్లో 24 వేల కోళ్ల మృతి**

**భోపాల్ ల్యాబ్ పరీక్షల్లో వైరస్‌గా నిర్ధారించిన అధికారులు**

**ప్రభావిత గ్రామాల్లో అప్రమత్తమైన అధికార యంత్రాంగం**

**ఆందోళన వద్దు, జాగ్రత్తలు పాటించాలన్న నిపుణులు**

## అసెంబ్లీకి ఒక్కరోజు వైసీపీ

**రేపు గవర్నర్ ప్రసంగానికి హాజరు**



**అమరావతి, ఫిబ్రవరి 9 (రిపబ్లిక్ న్యూస్)**
ఈ నెల 11వ తేదీ నుంచి ప్రారంభం కానున్న అసెంబ్లీ సమావేశాల తొలిరోజు గవర్నర్ అబ్దుల్ నజీర్ ప్రసంగానికి హాజరు కావాలని వైసీపీ అధ్యక్షుడు జగన్మోహనరెడ్డి నిర్ణయించారు. ఆ రోజు మాజీ సీఎం హోదాలో జగన్ వాహనాన్ని అసెంబ్లీ ప్రాంగణంలోకి అనుమతిస్తారా అంటూ శాసనసభావర్గాలను వైసీపీ నేతలు ఆరా తీసినట్టు తెలిసింది.

# ముదురుతున్న లోక్‌సభ వివాదం

(మొదటి పేజీ తరువాయి)

కోయంబత్తూరుతో పాటు పలు ప్రాంతాల విద్యార్థులతో ప్రధాని సంభాషించారు. 2047 నాటికి దేశాభివృద్ధికి దోహదపడాలనే విద్యార్థుల ఆసక్తిని ఆయన అభినందించారు. ఈ సందర్భంగా అభివృద్ధి చెందిన దేశాల పౌరులలో ఉండే క్రమశిక్షణను అలవర్చుకోవాలని సూచించారు. "ఇంట్లో భోజనం చేసేటప్పుడు ప్లేటులో ఒక్క మెతుకు కూడా వృథా చేయకుండా తినడం అలవాటు చేసుకోండి. ఇలా దేశంలోని ప్రతి ఒక్కరూ చేస్తే ఎంత ఆహారం ఆదా అవుతుందో ఊహించండి. ఇలాంటి చిన్న పనులే బలమైన, బాధ్యతాయుతమైన భారత నిర్మాణానికి పునాదులు వేస్తాయి" అని మోదీ విద్యార్థులకు వివరించారు. అలాగే ట్రాఫిక్ సిగ్నల్ వద్ద రెడ్ లైట్ పడినప్పుడు ఆగడం వంటి చిన్న విషయాలు కూడా వ్యక్తిగత క్రమశిక్షణకు నిదర్శనమని ప్రధాని తెలిపారు. స్ఫూర్తి, ప్రేరణ వంటివి విజయానికి కేవలం అదనపు హంగులు మాత్రమేనని, కానీ క్రమశిక్షణే దానికి అసలైన పునాది అని ఆయన స్పష్టం చేశారు. తొమ్మిదో విడతగా జరుగుతున్న ఈ కార్యక్రమానికి 4.5 కోట్లకు పైగా రిజిస్ట్రేషన్లు రావడం విశేషం. పరీక్షల ఒత్తిడిని తగ్గించడంతో పాటు దేశ ప్రగతిలో తమ పాత్ర గురించి విద్యార్థులను ఆలోచింపజేయడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం.

# విజయానికి క్రమశిక్షణేపునాది

(మొదటి పేజీ తరువాయి)

గత గురువారం ప్రధాని నరేంద్ర మోదీ ప్రసంగించాల్సి ఉండగా, విపక్షాల తీవ్ర నిరసనల మధ్య సభను స్పీకర్ అర్ధాంతరంగా వాయిదా వేశారు. 'ప్రధానిని లక్ష్యంగా చేసుకుని ప్రతిపక్ష ఎంపీలు ఏదో అనుకోనిది చేయొచ్చని సమాచారం అందింది' అని ఓం బిర్లా చెప్పడం వివాదానికి దారితీసింది. అంతకుముందు కొందరు మహిళా ఎంపీలు ప్లకార్డులతో ప్రధాని సీటు వద్దకు (ఆ సమయంలో ప్రధాని అక్కడ లేరు) వెళ్లారు. స్పీకర్ వ్యాఖ్యలను కాంగ్రెస్ నేత ప్రియాంక గాంధీ "పూర్తి అబద్ధాలు" అని కొట్టిపారేశారు. "ప్రధాని ఇప్పుడు స్పీకర్ చాటున దాక్కుంటున్నారు... ఆయనకు ధైర్యం లేదు" అని ఆమె తీవ్రంగా విమర్శించారు. ఈ అవిశ్వాస తీర్మానంలో స్పీకర్‌కు వ్యతిరేకంగా మూడు ప్రధాన అంశాలను ప్రతిపక్షాలు హైలైట్ చేయనున్నాయి. మాజీ ఆర్మీ చీఫ్ జనరల్ ఎంఎం నరవణే రాసిన పుస్తకంలోని కొన్ని భాగాలను చదివేందుకు ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీకి అనుమతి నిరాకరించడం మొదటిది. అదే సమయంలో కాంగ్రెస్‌ను, గాంధీ కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకున్న పుస్తకాల నుంచి చదివేందుకు బీజేపీ ఎంపీ నిషికాంత్ దూబేకు అనుమతి ఇవ్వడంపై విపక్షాలు మండిపడుతున్నాయి. నిబంధనలు ఉల్లంఘించిన దూబేపై ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నిస్తున్నాయి.

2020లో భారత్-చైనా సరిహద్దు వివాదంపై ఉన్న ఆ పుస్తక భాగాలను రికార్డుల్లో చేర్చాలని రాహుల్ పట్టుబట్టారు. తాను ఆ సమాచారానికి బాధ్యత వహిస్తానని లిఖితపూర్వకంగా ఇచ్చినా స్పీకర్ అంగీకరించలేదు. దీంతో సభలో తీవ్ర గందరగోళం చెలరేగింది. ఈ క్రమంలో నిరసన తెలిపిన 8 మంది కాంగ్రెస్ ఎంపీలను సమావేశాలు ముగిసే వరకు సస్పెండ్ చేశారు. "రాహుల్ గాంధీకి మాట్లాడే అవకాశం ఇవ్వలేదు. దీనిపై నిరసన తెలిపితే మమ్మల్ని సస్పెండ్ చేశారు. ఇది అంత పెద్ద నేరమా?" అని సస్పెండైన ఎంపీ అమరీందర్ రాజా వారింగ్ ప్రశ్నించారు. ఈ పరిణామాలతో పార్లమెంట్‌లో రాజకీయ వేడి మరింత పెరిగింది

# క్షేత్రస్థాయిలో ఉదాసీనత పనికిరాదు.

(మొదటి పేజీ తరువాయి)

అనుకున్న లక్ష్యాలను నిర్దేశించుకున్న సమయానికి పూర్తిచేయాలని తేల్చిచెప్పారు. పాలసీలను అమలు చేయాలనే లక్ష్యంతో ముందుకెళ్తున్నా మన్నారు. పల్లెపండుగకు రూ.2,500 కోట్లు, అడవితల్లి బాటకు రూ.1,005 కోట్లు మంజూరు చేశామని చెప్పారు. వివిధ పథకాలకు రూ.11,328 కోట్లు మంజూరు అయ్యాయని వివరించారు. జల్‌జీవన్ మిషన్‌కు రూ.25వేల కోట్ల మొబిలైజేషన్ చేశామన్నారు. ఇప్పటికే దాదాపు రూ.10వేల కోట్ల పనులు ప్రారంభ మయ్యాయని పవన్ తెలిపారు. ఉన్న తక్కువ వనరులను ఉపయోగించుకొని ఎక్కువ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రధాని సహాయ సహకారాలు, ముఖ్యమంత్రి అనుభవం ఎంతో ఉపయోగ పడుతుందని వెల్లడించారు. ప్రతి రూపాయి క్షేత్రస్థాయిలో కనిపించాలని... ప్రాజెక్టులు పారదర్శకంగా చేపట్టాలని సూచించారు. క్షేత్ర స్థాయిలో ఉదాసీనత ఉంటుందన్నారు డిప్యూటీ సీఎం. ముఖ్యమంత్రి ఇచ్చిన టార్గెట్‌లు రీచ్ కావలంటే చాలా వరకూ ఎక్స్యూజెస్ కనిపిస్తున్నాయని తెలిపారు. ముఖ్యమంత్రి, తాను అకౌంటబిలిటీ ఫిక్స్ చేసుకుంటున్నామని.. అందుకే క్షేత్ర స్థాయిలో ఫలితాలు రావాలని కోరుతున్నామని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరుగుతున్న ఈ సమావేశంలో జీఎస్డీపీ వృద్ధి రేటు, స్వర్ణాంధ్ర 2047 విజన్ లక్ష్యాల సాధన కోసం పది సూత్రాల అమలు, ఆదాయార్జన శాఖల పురోగతిపై సమీక్షించారు. 2026-27లో కేంద్ర ప్రాయోజిత పథకాల కార్యాచరణపై దిశానిర్దేశర చేసారు.

# అంబటి రాంబాబుకు బెయిల్ అయినా జైలుకే!

(మొదటి పేజీ తరువాయి)

ఆయనకు బెయిల్ మంజూరు చేసింది. దీంతో ఆయన జైలు నుంచి బయటకు వస్తారని అంతా భావించారు. అయితే, ఆయన బెయిల్‌పై విడుదలవుతున్న సమయంలోనే పట్టాభిపురం పోలీసులు మరో కేసులో రంగప్రవేశం చేశారు. గతంలో పోలీసులతో దురుసుగా ప్రవర్తించారన్న ఆరోపణలపై నమోదైన కేసులో పీటీ వారెంట్‌పై అంబటిని స్పెషల్ జ్యుడీషియల్ కోర్టులో హాజరుపరిచారు. ఈ కేసును విచారించిన న్యాయస్థానం, ఆయనకు 14 రోజుల పాటు అంటే ఈ నెల 22 వరకు జ్యుడీషియల్ రిమాండ్ విధించింది. సీఎంపై వ్యాఖ్యల కేసులో ఈ నెల 1న అరెస్టయిన అంబటి, అప్పటి నుంచి రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో రిమాండ్ ఖైదీగా ఉంటున్న విషయం తెలిసిందే. తాజాగా ఒక కేసులో బెయిల్ వచ్చినా, మరో కేసులో రిమాండ్ పడటంతో పోలీసులు ఆయన్ను తిరిగి రాజమహేంద్రవరం జైలుకు తరలించారు. కాగా, అంబటి రాంబాబుపై రాష్ట్రవ్యాప్తంగా సుమారు 36 కేసులు నమోదైనట్లు సమాచారం.

# అసెంబ్లీకి ఒక్కరోజు వైసీపీ

(మొదటి పేజీ తరువాయి)

ఇందుకు శాసనసభ వర్గాలు కూడా సుముఖతను వ్యక్తం చేసినట్టు సమాచారం. 2024 ఎన్నికల తర్వాత ఎమ్మెల్యేల ప్రమాణ స్వీకారం, గవర్నర్ ప్రసంగ కార్యక్రమాల కోసం అసెంబ్లీకి వైసీపీ ఎమ్మెల్యేలు వచ్చారు. ఆ తర్వాత నుంచి శాసనసభా సమావేశాలను బాయ్‌కాట్ చేస్తూ వస్తున్నారు. అయితే, కేంద్రానికి సానుకూల సంకేతాలు పంపించేందుకుగాను ప్రతిసారీ గవర్నర్ ప్రసంగానికి మాత్రం హాజరవుతున్నారు. గవర్నర్ ప్రసంగం రోజును శాసనసభ పని దినంగా గుర్తించరు. అందువల్ల, గవర్నర్‌కు గౌరవం ఇచ్చేలా ఈ కార్యక్రమానికి హాజరైతే, భవిష్యత్తులో ఎలాంటి సమస్యలూ ఎదురు కాబోవని జగన్ భావిస్తున్నారని వైసీపీ వర్గాలు చెబుతున్నాయి. ప్రస్తుతానికి గవర్నర్‌తో సఖ్యతను జగన్ కోరుకుంటున్నారని చెబుతున్నారు. అందువల్ల బుధవారం నాటి గవర్నర్ ప్రసంగానికి వైసీపీ ఉభయసభల సభ్యులూ హాజరవుతారని ఆ పార్టీ వర్గాలు చెబుతున్నాయి. గవర్నర్ ప్రసంగం తర్వాత మళ్లీ పాత విధానమే జగన్ కొనసాగిస్తారని అంటున్నాయి.

# డిజిటల్ మోసాల పై సుప్రీం ఆగ్రహం

(మొదటి పేజీ తరువాయి)

పలు చిన్న రాష్ట్రాల బడ్జెట్ల మొత్తం కన్నా డిజిటల్ మోసం ద్వారా స్వాధీనం చేసిన నగదు ఎక్కువని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోమాల్య బాగ్చి, జస్టిస్ ఎన్‌వి అంజరియాతో కూడిన ధర్మాసనం తెలిపింది. బ్యాంకు అధికారుల కుట్ర లేదా నిర్లక్ష్యం కారణంగా ఇటువంటి నేరాలు జరగవచ్చని వివరించింది. ఆర్బీఐ, బ్యాంకుల నుంచి సకాలంలో చర్యలు అవసరమని సూచించింది. ఆర్బీఐ, టెలికాం శాఖ (డీఓటీ) సూచనలు, ప్రామాణిక ఆపరేటింగ్ విధానాలను పరిగణనలోకి తీసుకుని నాలుగు వారాల్లోగా ముసాయిదా అవగాహన ఒప్పందాన్ని రూపొందించాలని హోంశాఖను ఆదేశించింది. సైబర్-ఆధారిత మోసాలను నిరోధించడానికి డెబిట్ కార్డులను తాత్కాలికంగా నిలిపివేసేందుకు బ్యాంకులు చర్యలు చేపట్టేలా ఎస్ఓపీని ఆర్బీఐ రూపొందించిందని తెలిపింది. సైబర్ అరెస్ట్ కేసులను గుర్తించాలని సీబీఐని ఆదేశించింది. గుర్తించిన డిజిటల్ అరెస్టు కేసుల్లో దర్యాప్తును కొనసాగించడానికి సీబీఐకి అనుమతినివ్వాలని గుజరాత్, ఢిల్లీ ప్రభుత్వాలను కోరింది. డిజిటల్ అరెస్ట్ కేసుల్లో పరిహారం అందించడానికి ఒక ప్రణాళికను (ఫ్రేమ్ వర్క్‌ను) రూపొందించడానికి ఆర్బీఐ, డీఓటీ ఇతరులు సంయుక్తంగా సమావేశాన్ని నిర్వహించాలని ఆదేశించింది. బాధితులకు పరిహారం మంజూరు చేయడంలో ఆచరణాత్మక, ఉదారవాద విధానం అవసరమని తెలిపింది. నాలుగు వారాల తర్వాత తదుపరి విచారణ చేపడతామని ఆదేశించింది. తదుపరి విచారణ తేదీలోపు తాజా స్టేటస్ నివేదికను సమర్పించాల్సిందిగా అధికారులను

# బర్డ్ ఫ్లూ కలకలం- 24వేల కోళ్ల మృతి

**అన్నమయ్య ఫిబ్రవరి 9 (రిపబ్లిక్ న్యూస్)**

ఏపీలోని అన్నమయ్య జిల్లాలో బర్డ్ ఫ్లూ వైరస్ మరోసారి తీవ్ర కలకలం సృష్టిస్తోంది. సదుం మండలంలోని మూడు గ్రామాల్లో వేలాది కోళ్లు అంతుచిక్కని రీతిలో మరణించడం స్థానికంగా ఆందోళనకు దారితీసింది. అధికారిక లెక్కల ప్రకారమే దాదాపు 24 వేలకు పైగా కోళ్లు మృత్యువాత పడ్డాయి. ఈ పరిణామంతో జిల్లా అధికార యంత్రాంగం అప్రమత్తమై నివారణ చర్యలు చేపట్టింది. వివరాల్లోకి వెళితే.. సదుం మండలంలోని పుట్టవాండ్లపల్లె, కంభంవారిపల్లె, అమ్మగారిపల్లె గ్రామాల్లోని కోళ్ల ఫారాల్లో గత కొన్ని రోజులుగా కోళ్లు భారీ సంఖ్యలో చనిపోతున్నాయి. దీంతో అనుమానం వచ్చిన పశుసంవర్ధక శాఖ అధికారులు రంగంలోకి దిగారు. మరణించిన కోళ్ల నుంచి నమూనాలను సేకరించి మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లో ఉన్న హై సెక్యూరిటీ యానిమల్ డిసీజ్ డయాగ్నోస్టిక్ ల్యాబ్‌కు పరీక్షల నిమిత్తం పంపించారు. ఈ పరీక్షల్లో బర్డ్ ఫ్లూ వైరస్ ఉన్నట్లు నిర్ధారణ అయింది. అమ్మగారిపల్లె, పుట్టవారిపల్లె గ్రామాల్లో కోళ్ల మృతికి బర్డ్ ఫ్లూనే కారణమని స్పష్టమైందని, కంభంవారిపల్లె నివేదిక రావాల్సి ఉందని జిల్లా పశుసంవర్ధక శాఖ జేడీ గుణశేఖర్ పిళ్లై వెల్లడించారు. ఈ పరిణామాలపై జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. వైరస్ వ్యాప్తిని అరికట్టేందుకు తక్షణమే కఠిన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. రెవెన్యూ, పోలీస్, వైద్య ఆరోగ్య, పంచాయతీరాజ్ శాఖల సమన్వయంతో గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. బర్డ్ ఫ్లూ కారణంగా నష్టపోయిన రైతులకు ప్రభుత్వం తరఫున నష్టపరిహారం అందిస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు జిల్లా కేంద్రంలో ప్రత్యేక కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశారు. తమ ప్రాంతంలో కోళ్లు గానీ, ఇతర పక్షులు గానీ అసాధారణ రీతిలో మరణిస్తే వెంటనే 70139 14401 లేదా 93982 62752 నంబర్లకు సమాచారం అందించాలని అధికారులు ప్రజలను కోరారు.

**కోడి మాంసం తినొచ్చా?.. వైద్యులు ఏం చెబుతున్నారంటే!**

మరోవైపు బర్డ్ ఫ్లూ విషయంలో ప్రజలు అనవసరంగా ఆందోళన చెందవద్దని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. ఈ వైరస్ కోళ్ల నుంచి మనుషులకు సోకే అవకాశాలు చాలా అరుదని స్పష్టం చేశారు. అయితే, మాంసాన్ని 100 డిగ్రీల సెల్సియస్ కంటే ఎక్కువ ఉష్ణోగ్రత వద్ద బాగా ఉడికించి తినడం సురక్షితమని తెలిపారు. ముందుజాగ్రత్త చర్యగా, వైరస్ ప్రభావిత ప్రాంతాల్లోని ప్రజలు కనీసం 10 రోజుల పాటు కోడిమాంసం, గుడ్లకు దూరంగా ఉండటం మంచిదని సలహా ఇస్తున్నారు.

# స్వర్ణాంధ్ర 2047 విజన్ లక్ష్యాలు సాధించాలి

(మొదటి పేజీ తరువాయి)

యాక్షన్ ప్లాన్, యువతకు నైపుణ్యాభివృద్ధి, వన్ ఫ్యామిలీ-వన్ ఎంటర్‌ప్రెన్యూర్ విధానం అమలుపై చర్చించారు. విశాఖలో గూగుల్ తో పాటు ఇతర సంస్థలు కూడా డేటా సెంటర్లు ఏర్పాటు చేయబోతున్నాయి.. మొత్తం 5 గిగావాట్ల సామర్థ్యంతో డేటా సెంటర్లు రాబోతున్నాయి.. కాకినాడలో గ్రీన్ అమ్మోనియా తయారీకి కూడా కార్యాచరణ మొదలైందిఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ వివిధ

అంశాలపై అధికారులకు దిశానిర్దేశర చేశారు. గతంలో జిల్లా కలెక్టర్ల సదస్సులు నిర్వహించేవారు కాదు.. ఇప్పుడు మూడునెలల కోసారి నిర్వహిస్తున్నాం. ప్రతినెలా రెండుసార్లు మంత్రివర్గ భేటీ జరుగుతోంది. నెలవారీగా అధికారులు సమీక్ష చేసుకోవాలి. జిల్లా స్థాయిలో కలెక్టర్లు, ఇన్‌ఛార్జ్ మంత్రులు సమర్థంగా పనిచేయాలి. ప్రపంచం గ్రీన్ ఎనర్జీ, గ్రీన్ హైడ్రోజన్ వైపు వెళ్తోంది. అమరావతి కేంద్రంగా క్వాంటం కంప్యూటింగ్‌కు శంకుస్థాపన చేశాం. రెండేళ్లలో ఇక్కడి నుంచి క్వాంటం కంప్యూటర్లు తయారవుతాయి. మనమే ప్రపంచానికి క్వాంటం కంప్యూటర్లు అందిస్తాం. ఏఐ, క్వాంటం కంప్యూటర్లు, డేటా సెంటర్లతో పెనుమార్పులు వస్తాయని సీఎం అన్నారు. వివిధ శాఖల వారీగా పురోగతిని అధికారులు సీఎంకు వివరించారు. సమావేశంలో స్త్రీ శక్తి పథకం విజయవంతమైన అమలుపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థను సీఎం ప్రత్యేకంగా అభినందించారు. సమావేశంలో ఏపీఎస్ఆర్టీసీ పనితీరుపై రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి సమక్షంలో ముఖ్యమంత్రి ప్రత్యేక ప్రశంసలు కురిపించారు. ఈ ప్రశంసలపై సంతోషం వ్యక్తం చేసిన మంత్రి మండిపల్లి.. తమకు బాధ్యత మరింత పెరిగిందన్నారు. స్త్రీ శక్తి పథకం ద్వారా ఇప్పటివరకు 4 కోట్ల మంది మహిళా ప్రయాణికులకు ఉచిత బస్సు ప్రయాణ సేవలను ఏపీఎస్ఆర్టీసీ విజయవంతంగా అందించిందని తెలిపారు. మహిళల సంక్షేమం కోసం ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. స్త్రీ శక్తి పథకాన్ని కేవలం బరువుగా కాకుండా బాధ్యతగా స్వీకరించి సేవలు అందిస్తామని తెలిపారు. భవిష్యత్తులో ఇంకా మెరుగైన సేవలను మహిళలకు అందిస్తామని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి స్పష్టం చేశారు. సమావేశంలో సీఎం చంద్రబాబు కీలక వ్యాఖ్యలు చేశారు. వైఎస్ జగన్ ఇంటి దగ్గర ఉన్న హెలిప్యాడ్ భూమిపై ఆరా తీశారు. జగన్ ఇంటి పక్కన ఉన్న హెలిప్యాడ్ కోసం భూమిని బలవంతంగా లాక్కున్నారు.. ప్రైవేట్ వ్యక్తికి దగ్గర కొనుక్కున్న భూమిని హెలిప్యాడ్ కోసం ఇవ్వనంటే.. బెదిరించారు.. అయినా ఇవ్వకపోతే.. 22-ఎలో పెట్టారు.. ప్రైవేట్ ల్యాండ్ ను దుర్మార్గంగా లాక్కున్నారు.. చట్టాలు చేయాల్సిన ముఖ్యమంత్రి, చట్టాలను అమలు చేయాల్సిన వ్యక్తి ప్రైవేట్ వ్యక్తి భూమిని ఇల్లీగల్ గా 22-ఎలో పెట్టాడు.. ఇది పరాకాష్ట కాదా? అని ప్రశ్నించారు. ఐదేళ్లు అవుతున్న అతనికి విముక్తి కలగలేదని తెలిపారు. మొన్న కలిసి అన్ని వివరాలు ఇచ్చారు.. భూములపై అప్పటి పాలకులు ఎంత దుర్మార్గంగా వ్యవహరించారు అనే దానిపై అందరూ ఆలోచించాలని చంద్రబాబు పేర్కొన్నారు. ఇక, రెవెన్యూ సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తూ వస్తున్నామని సీఎం చంద్రబాబు తెలిపారు. రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలను రాష్ట్రవ్యాప్తంగా ఇస్తున్నాం.. భూ వివాదాలు లేకుండా.. పకడ్బందీగా సర్వే ప్రక్రియ చేపడుతున్నాం.. క్యూఆర్ కోడ్ సహా ఇతర భద్రతా ఫీచర్లతో పాస్ పుస్తకాలను అందజేస్తున్నాం.. సాగునీటి కోసం ఇప్పటి వరకూ రూ. 24 వేల కోట్లు ఖర్చు చేశాం.. అని చంద్రబాబు వెల్లడించారు. సీఎం చంద్రబాబు నాయుడు అధ్యక్షతన మంత్రులు, వివిధ శాఖల కార్యదర్శులతో కీలక సమీక్షా సమావేశం సోమవారం ప్రారంభమైంది. సీఎస్ కె.విజయానంద్ స్వాగతోపన్యాసం చేశారు.

# నియోజవర్గాల్లోని స్థితిగతులపై ర్యాంకింగ్స్

**అమరావతి, ఫిబ్రవరి 9**

విజయవాడ పశ్చిమ నియోజకవర్గం వివిధ రంగాల్లో అద్భుత పనితీరు కనబర్చి నూటికి 93 మార్కులతో ఏ ప్లస్ గ్రేడ్ సాధించింది. రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లో మొదటి స్థానంలో నిలిచింది. హిందూపురం 5వ స్థానంలో, పిఠాపురం 10వ స్థానంలో నిలవగా, కుప్పం, మంగళగిరికి తొలి-13 స్థానాల్లో చోటు దక్కలేదు. రాష్ట్రవ్యాప్తంగా నియోజకవర్గాల్లోని స్థితిగతులపై నివేదిక ఆధారంగా ప్రభుత్వం ర్యాంకింగ్స్ ఇచ్చింది. ఎమ్మెల్యేల పనితీరును బట్టి ఎమ్మెల్యేలకు వచ్చిన ర్యాంకులుగా వీటిని చూడరాదని స్పష్టం చేసింది. ఆయా జిల్లాలు, నియోజకవర్గాల్లో ఉన్న వనరుల ఆధారంగా 141 నుంచి 69 సూచికలను పరిగణనలోకి తీసుకుని ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ నివేదికను విడుదల చేశారు. మంత్రులు, కార్యదర్శుల సమావేశంలో ఈ ప్రగతి నివేదికపై సీఎం చర్చించారు.

మొత్తం 175 నియోజకవర్గాలకు 2026 జనవరి వరకు ఉన్న డేటా ఆధారంగా ర్యాంకింగ్‌లు ఇచ్చారు. నూటికి 90 శాతం కన్నా ఎక్కువ మార్కులు సాధిస్తే ఎక్సలెంట్ అని ఏ ప్లస్ గ్రేడ్ ఇచ్చారు. 75 నుంచి 89 శాతం మార్కులు సాధిస్తే గుడ్ అని ఏ గ్రేడ్, 50 నుంచి 74 శాతం సాధిస్తే మోడరేట్ అని బీ గ్రేడ్, 50 శాతం కన్నా తక్కువ సాధిస్తే పూర్ అని పేర్కొంటూ సీ గ్రేడ్ ఇచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా ఏ ప్లస్ సాధించిన నియోజకవర్గాలు 21, ఏ గ్రేడ్ సాధించినవి 153 ఉన్నాయి. బీ గ్రేడ్ సాధించిన నియోజకవర్గం ఒకే ఒక్కటి ఉండగా, సీ గ్రేడ్ సాధించిన నియోజకవర్గాలు ఏవీ లేకపోవడం గమనార్హం. విజయవాడ పశ్చిమ 93 మార్కులతో ఏప్లస్ గ్రేడ్ సాధించగా, తర్వాతి స్థానాల్లో వరుసగా గాజువాక (92 మార్కులు), కాకినాడ సిటీ (92 మార్కులు), విజయవాడ తూర్పు, హిందూపురం, పెనుకొండ, కదిరి, విశాఖపట్నం పశ్చిమ, మాడుగుల, పిఠాపురం, రామచంద్రాపురం, జగ్గంపేట, గోపాలపురం(ఎస్సీ) అన్నీ 91 మార్కులు సాధించి ఏ ప్లస్‌లో నిలిచాయి. కొండెపి (ఎస్సీ) 79 మార్కులు, కందుకూరు 78 మార్కులు, కావలి 78 మార్కులు, ఒంగోలు 77 మార్కులతో ఏ గ్రేడ్ సాధించాయి. జాబితాలో గుంటూరు పశ్చిమ నియోజకవర్గం 73 మార్కులతో బీ గ్రేడ్‌తో చిట్టచివరి స్థానంలో నిలిచింది.

**జిల్లాల వారీగా ప్రగతి ఇలా..**

వ్యవసాయ-అనుబంధ, పారిశ్రామిక, సేవా రంగాలతో పాటు వివిధ రంగాల్లో వివిధ రంగాల్లో జిల్లాలు సాధించిన ప్రగతి ఆధారంగా ర్యాంకులు, గ్రేడ్‌లు కేటాయించారు. వ్యవసాయ, అనుబంధ రంగాల్లో కాకినాడ 94 మార్కులతో ఏ ప్లస్ గ్రేడ్ సాధించి మొదటి స్థానంలో నిలిచింది. ఆ తర్వాతి స్థానంలో శ్రీసత్యసాయి, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలు నిలిచాయి. ఈ రంగంలో అల్లూరి సీతారామరాజు జిల్లా 69 మార్కులతో బీ గ్రేడ్‌తో అట్టడుగున నిలిచింది.

పారిశ్రామిక రంగంలో విశాఖపట్నం 99 మార్కులతో ఏ ప్లస్ గ్రేడ్ సాధించి అగ్రస్థానంలో నిలిచింది. ఆ తర్వాతి స్థానంలో అన్నమయ్య, పార్వతీపురం మన్యం నిలవగా, చిట్టచివరి స్థానంలో పశ్చిమ గోదావరి జిల్లా 38 మార్కులతో సీ గ్రేడ్ సాధించింది. ఏలూరు జిల్లా కూడా 48 మార్కులతో సీ గ్రేడ్‌తో చివరి నుంచి రెండో స్థానంలో నిలిచింది.

సేవా రంగంలో గుంటూరు జిల్లా 97 మార్కులతో ఏ ప్లస్ గ్రేడ్‌తో అగ్రస్థానంలో నిలిచింది. ఆ తర్వాతి స్థానాల్లో అనంతపురం, బాపట్ల 96, 95 మార్కులతో ఏ ప్లస్ గ్రేడ్ సాధించాయి. చివరి స్థానంలో చిత్తూరు జిల్లా 75 మార్కులతో ఏ గ్రేడ్ సాధించింది.

ఎస్డీజీ (సస్టెయినబుల్ డెవల్‌పమెంట్ గోల్), ఆరోగ్య రంగాల్లో పల్నాడు, తిరుపతి జిల్లాలు మొదటి రెండు స్థానాల్లో నిలిచాయి. చివరి రెండు స్థానాల్లో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ, అల్లూరి సీతారామరాజు జిల్లాలు నిలిచాయి.

2024-25లో వ్యవసాయ, అనుబంధ రంగాల్లో 9.03 శాతం వృద్ధి సాధించగా, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 10.14 శాతం వృద్ధి అంచనా వేస్తున్నారు.

పారిశ్రామిక రంగంలో గత ఆర్థిక సంవత్సరంలో 8.05 శాతం వృద్ధి సాధించగా, ఈ ఏడాది 9.15 శాతం వృద్ధి అంచనా వేస్తున్నారు.

సేవా రంగంలో గత ఆర్థిక సంవత్సరంలో 8.7 శాతం వృద్ధి నమోదు కాగా, ఈ ఏడాది 10.67 శాతం వృద్ధిరేటు అంచనా వేస్తున్నారు. స్థూల విలువ జోడింపు గత ఏడాది 8.6 శాతం పెరగ్గా, ఈ ఏడాది 10.07 శాతం వృద్ధిరేటు అంచనా వేస్తున్నారు. జీఎస్డీపీ 8.27 శాతం నమోదు కాగా, ఈ ఏడాది 9.88 శాతం అంచనా వేస్తున్నారు. గత ఆర్థిక సంవత్సరంలో జాతీయ జీడీపీ 6.51 శాతం నమోదు కాగా, ఈ ఏడాది 7.4 శాతం అంచనా వేస్తున్నారు.

# మూగబోయిన మైకులు

(మొదటి పేజీ తరువాయి)

రీ పోలింగ్ నిర్వహించనున్నారు.

ఫిబ్రవరి 14న మేయర్, డిప్యూటీ మేయర్, చైర్మెన్, వైస్ చైర్మెన్ ఎన్నిక కోసం సంబంధిత కలెక్టర్ నియమించిన అధికారి ప్రత్యేక సమావేశం కోసం నోటిఫికేషన్ విడుదల చేస్తారు. ఫిబ్రవరి 16న ప్రమాణ స్వీకారం అనంతరం ఎన్నిక నిర్వహిస్తారు. ఏదైనా కారణం చేత ఎన్నిక వీలు కాకుంటే మరుసటి రోజు ఫిబ్రవరి 17 నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించి జనవరి 28 నుంచి 30 వరకు నామినేషన్లను స్వీకరించారు. జనవరి 31న నామినేషన్ల పరిశీలన, ఫిబ్రవరి 3న తుది అభ్యర్థుల జాబితా విడుదల చేశారు.

ఎన్నికలు జరుగుతున్న మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాల్టీల్లో 8,203 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేశారు. 52.43 లక్షల మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఇందులో 25.62 మంది పురుష ఓటర్లు, 26.80 మంది మహిళా ఓటర్లు, 640 మంది ఇతరులు ఉన్నారు. బ్యాలెట్ పేపర్ విధానంలో జరుగుతున్న ఎన్నికల నిర్వహణకు 16,031 బ్యాలెట్ బాక్సులు, 137 స్ట్రాంగ్ రూంలను ఏర్పాటు చేశారు.

అలాగే 136 లెక్కింపు కేంద్రాలను సిద్ధం చేశారు. ప్రశాంత వాతావరణంలో స్వేచ్ఛగా ఎన్నికలు నిర్వహించేందుకు 742 జోనల్ అధికారులు, 279 ఎఫ్ఎస్‌టీ, 381 ఎస్ఎస్‌టీ టీంలను ఎన్నికల సంఘం ఏర్పాటు చేసింది 1,379 రిటర్నింగ్ అధికారులు, 1,547 అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు, 9,560 పోలింగ్ ఆఫీసర్స్, 31,428 అసిస్టెంట్ పోలింగ్ ఆఫీసర్లు మొత్తం 45,316 మంది ఎన్నికల విధులు నిర్వహించనున్నారు.

చేసిన అభివృద్ధి, చేయాల్సిన పనులను ఎంత ఆర్భాటంగా ప్రచారం చేసినా చివరి రెండు రోజులు డబ్బు, మద్యం పంపిణి చేయందే ఓట్లు రాలని విచిత్రమైన పరిస్థితి నేడు రాష్ట్రంలో నెలకొంది. ఈ క్రమంలో రాజకీయ పార్టీలు, అభ్యర్థులు తమ ట్రెండ్ మార్చి సైలెంట్ ప్రచారానికి తెరతీశారు. దాంతో చివరి రెండు రోజులు ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు మద్యం, డబ్బు, ఇతర తాయిలాల పంపిణీపై దృష్టి పెట్టారు. గెలుపోటములపై ప్రభావం చూపే అధికారం, కులం, తదితర అంశాలను తమకు అనుకూలంగా మల్చుకునేందుకు రాజకీయ పార్టీలు, అభ్యర్థులు వదులుకోవడం లేదు.

సద్దుమణిగిన హడావిడి

మున్సిపల్ ప్రచారంలో అన్ని పార్టీలు జోష్ మీద కనిపించాయి. ఫిబ్రవరి 3న అభ్యర్థుల తుది జాబితా ప్రకటించి గుర్తులు కేటాయించారు. 9వ తేది సాయంత్రం వరకు దాదాపు ఆరు రోజుల పాటు ప్రచారం సాగింది. పంచాయతీల్లోలాగా పెద్ద పెద్ద సభలు కాకుండా చిన్న చిన్న సమావేశాలు, కార్నర్ మీటింగ్‌లు, రోడ్‌షోలకు నేతలు ప్రాధాన్యత ఇచ్చారు. అసెంబ్లీ ఎన్నికల మాదిరిగా ఆర్భాటంగా కాకుండా తమకున్న పరిధిలో అభ్యర్థులు ప్రచారం నిర్వహించారు.

## పూసులూరు గ్రామంలో నూతన సీసీ రోడ్డు పనులకు భూమి పూజ చేసి ప్రారంభించిన ఎన్ఎండి ఫిరోజ్



**నంద్యాల బ్యూరో ఫిబ్రవరి 9 ( రిపబ్లిక్ న్యూస్):** నంద్యాల మండలం పూసులూరు గ్రామంలోని కోదండరామాలయం వద్ద నూతన సీసీ రోడ్డు నిర్మాణ పనుల భూమి పూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన తెలుగుదేశం పార్టీ నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ గారు భూమి పూజలో పాల్గొని రోడ్డునిర్మానాపనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎన్ఎండి ఫిరోజ్ గారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచే నంద్యాల నియోజకవర్గంలో అభివృద్ధి పనులు అత్యంత వేగంగా జరుగుతున్నాయన్నారు. నంద్యాల మండలం పరిధిలోని ప్రతి గ్రామంలో మౌలిక వసతులు కల్పించి అన్ని విధాలుగా అభివృద్ధి చేసి తీరుతామని స్పష్టం చేశారు. అదే విధంగా సోమవారం పూసులూరు గ్రామంలో నూతన రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించడం ఎంతో సంతోషకరమైనవిషయమన్నారు. ప్రతిపక్ష పార్టీలకు కూటమి ప్రభుత్వంపై విమర్శలు చేయడమే పనిగా మారిందనీ, కూటమి ప్రభుత్వం ఒకవైపు సంక్షేమ పథకాలను అమలు చేస్తూనే మరోవైపు అభివృద్ధి కార్యక్రమాలను కూడా సమర్థవంతంగా అమలు చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో పూసులూరు గ్రామ టీడీపీ నాయకులు రాం గోపాల్ రెడ్డి, రాం కృష్ణ రెడ్డి, సీతారాం రెడ్డి, రవీంద్ర రెడ్డి, ప్రసాద్ రెడ్డి, విజేయుడు, శేఖర్, వెంకటేశ్వర్లు తో పాటు పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# లారీ, బస్ డ్రైవర్లకు ఉచిత ఆరోగ్యకంటి పరీక్షలు

## రోడ్డు భద్రతకు 'మేకింగ్ ది డిఫరెన్స్'తో కలిసి రాయలసీమ ఎక్స్‌ప్రెస్ వే కార్యక్రమం

**నంద్యాల, బ్యూరోఫిబ్రవరి 09 (రిపబ్లిక్ న్యూస్)** రాయలసీమ ఎక్స్‌ప్రెస్ వే ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో రోడ్డు భద్రత కార్యక్రమంలో భాగంగా "మేకింగ్ ది డిఫరెన్స్" ఎన్జీఓ సహకారంతో నంద్యాల లారీ ఓనర్స్ అసోసియేషన్ ప్రాంగణంలో లారీ డ్రైవర్లు, బస్ డ్రైవర్లు, క్లీనర్లకు రెండు రోజుల పాటు ఉచిత ఆరోగ్య మరియు కంటి పరీక్షల శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో అవసరమైన వారికి ఉచితంగా కంటి అద్దాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నంద్యాల జిల్లా అదనపు డిఎస్పీ మందజావళి, రాయలసీమ ఎక్స్‌ప్రెస్ వే ప్రాజెక్టు హెడ్ మదన్మోహన్ వంగర, నంద్యాల ఏపీఎస్ఆర్టీసీ డిపో మేనేజర్ మాధవీలత, ట్రాఫిక్ సీఐ చాంద్ బాషా, లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆనంద్ తదితరులు పాల్గొన్నారు. శిబిరంలో సుమారు 200 మంది డ్రైవర్లకు సాధారణ ఆరోగ్య పరీక్షలు, కంటి పరీక్షలు నిర్వహించగా, అవసరమైన వారికి ఉచిత కంటి అద్దాలు అందజేశారు.

ఈ సందర్భంగా అదనపు డిఎస్పీ మంద జావళి





మాట్లాడుతూ డ్రైవర్ల ఆరోగ్యం రోడ్డు భద్రతకు కీలకమని పేర్కొన్నారు. ఇలాంటి వైద్య శిబిరాలను డ్రైవర్లు సద్వినియోగం చేసుకోవాలని, మద్యం సేవించి వాహనాలు నడపకూడదని, ట్రాఫిక్ నిబంధనలను కచ్చితంగా పాటించాలని సూచించారు. రాయలసీమ ఎక్స్‌ప్రెస్ వే ప్రాజెక్టు హెడ్ మదన్మోహన్ వంగర మాట్లాడుతూ డ్రైవర్ల కోసం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయడం ఆనందంగా ఉందని తెలిపారు. కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రతి డ్రైవర్ వినియోగించుకోవాలని కోరారు. అలాగే ఏవైనా ప్రమాదాలు జరిగినప్పుడు 1033 హెల్ప్‌లైన్ నంబర్‌ను వినియోగించుకోవాలని సూచిస్తూ, రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని స్పష్టం చేశారు. కర్నూల్ నుంచి కడప వరకు ఉన్న హైవే మార్గంలో రెండు రెస్ట్ ఏరియాలు, నాలుగు ట్రక్ లే-బైలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. డ్రైవర్లు అలసటగా అనిపించినప్పుడు అక్కడ వాహనాలను నిలిపి విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. రెస్ట్ ఏరియాలు, ట్రక్ లే-బై లొకేషన్లకు సంబంధించిన క్యూఆర్ కోడ్ కరపత్రాలను ముద్రించి పంపిణీ చేస్తున్నట్లు వెల్లడించారు.

# శ్రీ శారదా విద్యాపీఠం విద్యార్థులకు నోటు పుస్తకాలు

## అందజేసిన టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్

**నంద్యాల బ్యూరో ఫిబ్రవరి 9 ( రిపబ్లిక్ న్యూస్):** నంద్యాల పట్టణం 7 వ వార్డు ఫరూక్ నగర్ కు చెందిన శ్రీ శారదా విద్యాపీఠం పేద విద్యార్థులకు నంద్యాల టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ నోటు పుస్తకాలను అందజేశారు. సోమవారం నంద్యాలలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో శ్రీ శారదా విద్యాపీఠం హెడ్ మాస్టర్ కి ఫిరోజ్ ఈ పుస్తకాలను అప్పగించారు. ఈ సందర్భంగా ఎన్ఎండి ఫిరోజ్ మాట్లాడుతూ రాష్ట్ర మంత్రి వర్యులు ఎన్ఎండి ఫరూక్ జనవరి ఒకటో తేదీన ఇచ్చిన పిలుపు మేరకు ఈ సేవా కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. బొకేలు వద్దు - పుస్తకాలు ముద్దు అనే నినాదంతో మంత్రి ఫరూక్ గారు చేసిన సూచనకు నాయకులు,




కార్యకర్తలు విశేషంగా స్పందించారని ఆయన పేర్కొన్నారు. నాయకులు అందజేసిన పెన్నులు, పుస్తకాలు, స్కూల్ బ్యాగులను నేడు నిరుపేద విద్యార్థిని విద్యార్థులకు అందజేస్తున్నామని ఫిరోజ్ వివరించారు. ఈ పుస్తకాలు విద్యార్థుల చదువుకు ఎంతో కొంత తోడ్పడతాయని ఆయన



ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో శ్రీ శారదా విద్యా పీఠంప్రధానాచార్యులు వెంకట కృష్ణయ్య, కౌన్సిలర్ కండె శ్యాంసుందర్ లాల్, తెలుదేశం పార్టీ నంద్యాల జిల్లా అధికార ప్రతినిధి బింగుమళ్ల శ్యామ్ సుందర్ గుప్త , 7 వ వార్డ్ ఫరూక్ నగర్ ఇంచార్జి సైలాబ్ , మార్కెట్ యార్డ్ డైరెక్టర్ అజ్మీర్ ,పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## విదేశాల్లో వెల్డింగ్ ఉద్యోగ అవకాశాలు- అవగాహన సదస్సు

**నంద్యాల బ్యూరో, ఫిబ్రవరి 9, (రిపబ్లిక్ న్యూస్):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృది సంస్థ, ఓవర్సీస్ మ్యాన్ పవర్ కంపెనీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్, నేషనల్ అకాడెమీ ఆఫ్ కన్స్ట్రక్షన్ సంయుక్తంగా రాయలసీమ ప్రాంతం లోని నిరుద్యోగ యువతకోసం, ఇతరదేశాల్లో వెల్డింగ్, నిర్మాణరంగం నందు ఉద్యోగ అవకాశాలు మీద అవగాహన సదస్సును ఈనెల 12వ తేదీన పులివెందులలోని నేషనల్ అకాడెమీ ఆఫ్ కన్స్ట్రక్షన్ నందు వెల్డింగ్, నిర్మాణరంగం నందు విదేశాల్లో శిక్షణ ఇచ్చే సాఫ్కో ఇండస్ట్రియల్ ట్రైనింగ్, అసెస్మెంట్ వారి ద్వారా అవగాహన కార్యక్రమం నిర్వహించబడునని ఎన్.ఏ.సి. ఏడి సంతోష్ కుమార్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి 10వ తరగతి, ఐటిఐ, డిప్లొమా, ఇంజనీరింగ్ చదివి 19 సం.. నుండి 45 సం.. వయస్సు గల అభ్యర్థులు హాజరు అయ్యి సదస్సును సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇతర వివరాలకు నాక్ బిల్డింగ్, పులివెందుల నందు లేదా 9000517637, 9701271158 ను సంప్రదించాలని పేర్కొన్నారు.




# రానున్న అసెంబ్లీ సమావేశాల్లో నిరుద్యోగ సమస్యపై చర్చించాలి

### తక్షణమే జాబ్ క్యాలెండర్ ప్రకటించాలి

### ఎఐవైఎఫ్ డిమాండ్

**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ ఫిబ్రవరి 9)** రాష్ట్రంలో నిరుద్యోగ సమస్యను తక్షణమే పరిష్కరించాలని, వివిధ ప్రభుత్వ శాఖలు మరియు ప్రభుత్వ రంగ సంస్థల్లో ఉన్న ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత యువజన సమాఖ్య (ఎఐవైఎఫ్) ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన నిరసన కార్యక్రమాల్లో భాగంగా కర్నూలు కలెక్టర్ కార్యాలయం ముందు శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎఐవైఎఫ్ నగర అధ్యక్షులు నాగరాజు అధ్యక్షత వహించారు. ధర్నాలో పాల్గొన్న ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఈ. శ్రీరాములు, కె. శ్రీనివాసులు మాట్లాడుతూ

ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఇప్పటివరకు అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని తీవ్రంగా విమర్శించారు.

ఎన్నికల సందర్భంగా అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదిలోనే ప్రభుత్వ శాఖల్లోని ఖాళీలను భర్తీ చేస్తామని, ప్రతి ఏడాది జనవరిలో జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని, నిరుద్యోగ యువతకు శిక్షణ, ప్రోత్సాహకాలు




అందించి పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దుతామని, అలాగే నిరుద్యోగ యువతకు రూ.3,000 నిరుద్యోగ భృతి అందిస్తామని హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 19 నెలలు గడిచినా ఒక్క హామీపై కూడా స్పష్టమైన కార్యాచరణ ప్రకటించకపోవడం దురదృష్టకరమని అన్నారు. రానున్న అసెంబ్లీ సమావేశాల్లో నిరుద్యోగ సమస్యపై ప్రత్యేకంగా చర్చించి, మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు చేయాలని, తక్షణమే జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని, ఎన్నికల హామీ మేరకు నిరుద్యోగ యువతకు రూ.3,000 భృతి అందించాలని వారు డిమాండ్ చేశారు. అలాగే ఎన్నికల సమయంలో వాలంటీర్లకు ఇచ్చిన హామీలను అమలు చేసి వారికి న్యాయం చేయాలని కోరారు.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్రానికి వచ్చిన పెట్టుబడులు, వాటి ద్వారా యువతకు లభించిన ఉద్యోగ అవకాశాలపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లడ్డు పేరుతో రాజకీయాలు చేస్తూ, చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్, నారా లోకేష్‌లను పొగడటానికే అసెంబ్లీ సమావేశాలను కాలయాపన చేస్తే ఎఐవైఎఫ్‌గా అసెంబ్లీ ముట్టడిస్తామని హెచ్చరించారు.

ఈ సందర్భంగా జిల్లా సహాయ కార్యదర్శులు బిషన్న, రాజీవ్ మాట్లాడుతూకూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రోడ్డున పడిన వార్డు వాలంటీర్లు, ఏపీ బెవరేజెస్ కార్పొరేషన్ పరిధిలో పనిచేసిన మద్యం దుకాణాల సిబ్బంది, సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ పరిధిలోని రేషన్ వాహన డ్రైవర్లు, హెల్పర్లకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం సానుకూలంగా స్పందించకపోతే రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమానికి సిద్ధమవుతామని, అవసరమైతే సీఎం క్యాంప్ కార్యాలయాన్ని కూడా ముట్టడిస్తామని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో వాలంటీర్ అసోసియేషన్ నాయకులు మహబూబ్ బాషా, ఎఐవైఎఫ్ నగర నాయకులు శ్రీకాంత్, చిన్న, చంటి, అఖిల్ కళాకారు, భద్ర కుమార్, రసూలు, వీరయ్య, రవి, రాజశేఖర్, సురేంద్ర యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# 5వ వార్డులో జన నీరాజనం.

### 5వ వార్డులో కాంగ్రెస్ పార్టీ డప్పు చప్పుడులతో,బతుకమ్మ ఆట పాటలతో ఇంటింటి ప్రచారం.

### మద్దతు తెలుపుతున్న ఆ వార్డు ప్రజలు. -కౌన్సిలర్ అభ్యర్థి కొత్తగొల్ల మాధవి శ్రీనివాస్





**ఆందోల్ నియోజకవర్గం ప్రతినిధి ఫిబ్రవరి 9( రిపబ్లిక్ న్యూస్)** అందోల్ జోగిపేట మున్సిపాలిటీ పరిధిలో 5వ వార్డ్ లో సోమవారం అభ్యర్థి కొత్తగోల్ల మాధవి శ్రీనివాస్ యాదవ్ ప్రచారం జోరుగా డప్పు చప్పుడులతో,ఆడపడుచులు బతుకమ్మ ఆటపాటలతో నృత్యాలు చేసుకుంటూ ఇంటింటి ప్రచారం సాగిస్తున్నారు.

కొత్తగొల్ల మాధవి శ్రీనివాస్ యాదవ్ జనం బ్రహ్మరథం పడుతున్నారు. ఎప్పుడు నవ్వుతూ నలుగురిలో ఉండేవాడు కల్మషం లేనటువంటి యువ నాయకుడు అందరితో కలిసి ఉండే తిరిగే వ్యక్తి మొలకల బలరాం కు పూర్తి మద్దతు ప్రకటిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ చేయి గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కొత్త గోల్ల మాధవి శ్రీనివాస్ యాదవ్,అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ చైర్మన్ తుడం రాములు, పుర శ్రీనివాస్, తుడుం అశోక్, అరవింద్, శ్రీకాంత్ రెడ్డి, రవి, కాంగ్రెస్ యువ నాయకులు, కార్యకర్తలు మహిళలు భారీ ప్రచారం నిర్వహించారు.

## తిరుమల లడ్డూ కౌంటర్లలో ఆన్‌లైన్ పేమెంట్

### క్యూఆర్ కోడ్‌తో విక్రయానికి యోచన

తిరుమల**ఫిబ్రవరి 9 (రిపబ్లిక్ న్యూస్)** శ్రీవారి దర్శనార్థం తిరుమలకు వచ్చిన భక్తులు సులభంగా లడ్డూలు పొందేలా టీటీడీ ఆలోచనలు చేస్తోంది. లడ్డూ విక్రయ కేంద్రంలోని ప్రతి కౌంటర్ వద్ద యూపీఐ పేమెంట్‌కు అవకాశం కల్పించనుంది. దీంతో చిల్లర కోసం వెతుక్కునే పనిలేకుండా పోనుంది. అలాగే ఆన్‌లౌన్ పేమెంట్‌తో నగదు లెక్కింపు సమసయా తీరనుందని అంటున్నారు. ఏటా లడ్డూల విక్రయాలు భారీగా పెరుగుతున్నాయి. కౌంటర్ వద్ద భక్తులు నగదు చెల్లించి లడ్డూలు పొందుతున్నారు. శ్రీవారి ఆల యం వెనుకభాగంలోని లడ్డూ విక్రయ కేంద్రంలో గతేడాది కియోస్క్ యంత్రాలను టీటీడీ అందుబాటులోకి తెచ్చింది. ఇటీవల యూపీఐ పేమెంట్లు చేసే వారి సంఖ్య పెరిగిన క్రమంలో ఈ నూతన యంత్రాలను అందుబాటులో ఉంచింది. కావాల్సిన లడ్డూల సంఖ్య ఎంపిక చేసి యూపీఐ ద్వారా పేమెంట్ చేస్తే వచ్చే రశీదు ఆధారంగా కౌంటర్‌లో లడ్డూలు పొందవచ్చు. అయితే, ఈ యంత్రాల వద్ద ఇటీవల రద్దీ అధికం కావడం, యంత్రాల్లో సాంకేతిక ఇబ్బందులు, మళ్లీ లడ్డూల కోసం కౌంటర్ క్యూలైన్లలో నిలబడడం తదితర కారణాల నేపథ్యంలో కౌంటర్ల వద్దే పేమెంట్ క్యూఆర్ కోడ్ బోర్డులను ఏర్పాటు చేయాలని అధికారులు యోచిస్తున్నారు. తద్వారా అదనంగా కియోస్క్ యంత్రాల ముందు నిలబడే అవసరం ఉండదని, నేరుగా కౌంటర్‌లోనే లడ్డూలు పొందవచ్చని అభిప్రాయపడుతున్నారు. ఈ సర్వీసును ఇచ్చేందుకు ఓ బ్యాంక్ కూడా ముందుకు వచ్చినట్టు సమాచారం. తొలుత ప్రయోగాత్మకంగా కొన్ని కౌంటర్లలో ఈ విధానాన్ని అమలుచేసి వచ్చే ఫలితాలను బట్టి అన్ని కౌంటర్ల వద్ద ఏర్పాటు చేయాలని టీటీడీ అధికారులు

# బాల్య వివాహాలు బాలికల అభివృద్ధికి ఆటంకాలు






**గోనిగండ్ల ఫిబ్రవరి 9 (రిపబ్లిక్ న్యూస్)** బాల్య వివాహ ముక్తు భారత్ 100 రోజుల ప్రణాళికలో భాగంగా గోనెగండ్ల మండలం తిప్పనూరు గ్రామ సచివాలయంలో బాల్య వివాహాల నిర్మూలన కోసం నిర్వహించిన కార్యక్రమములో గోనిగండ్ల మండలం తాసిల్దార్ రాజేశ్వరి మరియు ఐసిడిఎస్ సూపర్వైజర్ రాధా ఐసిడిఎస్ సూపర్వైజర్ రాధా జిల్లా బాలల పరిరక్షణ విభాగం సామాజిక కార్యకర్త నరసింహులు కోనేరు స్వచ్ఛంద సంస్థ మునుస్వామి మరియు అంగన్వాడి కార్యకర్తలు గ్రామ ప్రజలు అందరూ కలిసి బాల్య వివాహ రహిత భారతదేశము మరియు ఆంధ్రప్రదేశ్ కోసం ప్రతిజ్ఞ చేయడం జరిగినది. అమ్మాయికి కచ్చితంగా18 సః, పూర్తి కావాలి అదేవిధంగా అబ్బాయిలకి 21 సంవత్సరాలు పూర్తి పూర్తయిన తర్వాతనే వివాహాలు వివాహం చేయాలని తెలిపారు ఒకవేళ బాల్య వివాహం చేస్తే బాల్య వివాహా నిషేధ చట్ట ప్రకారం కేసు నమోదు చేయవలసి వస్తుందని తెలిపారు .కేంద్ర ప్రభుత్వము బాల్య వివాహా రహిత భారతదేశం కోసం బాల్య వివాహ ముక్తు భారత్ కార్యక్రమమును తీసుకురావడం జరిగింది ముఖ్యంగాఈ కార్యక్రమం చిన్న వయసులో జరిగే బాల్య వివాహాలను అరికట్టి బాలికలు చదువుకునేటట్లు చేస్తూ వారిని ఉన్నతమైన స్థాయిలో ఎదగడానికి ఈ కార్యక్రమం ఎంతోగానో దోహదపడుతుందని తెలిపారు. కోనేరు స్వచ్ఛంద సంస్థ ఏరియా కోఆర్డినేటర్ మునిస్వామి మాట్లాడుతూ ఆపదలో ఉన్నటువంటి బాలబాలికాలు తమ తమ సమస్యలను పరిష్కరించుకోవడానికి చైల్డ్ హెల్ప్ లైన్ నెంబర్1098 ద్వారా పరిష్కరించుకోవచ్చు అని తెలిపారు ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ జయసుధ, హెల్పర్ మౌనిక కార్యకర్తలు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.




➤పట్టు, ఫ్యాన్సీ హోల్ సేల్ ధరలకు ప్రసిద్ధి

➤ఆఫర్ల ద్వారా నాణ్యమైన వస్త్రాలు విక్రయాలు

➤అక్క చెల్లెమ్మలకు చీరలు బంపర్ ఆఫర్లు

➤బ్రాండెడ్ నారాయణ( శ్రీ లక్ష్మీ శారీ సెంటర్)

ప్రధాన కార్యాలయం

# "వ్యాపారమే నా బ్రాండ్"

ఇన్నా కళామతల్లి అతన్ని బ్రాండెడ్ (నారాయణ) ను చేసింది. వీక్షించిన ప్రేక్షకులు ఆయనకు వీరాభిమాను లయ్యారు. ఆ అభిమానమే ఆయనను ఒక గొప్ప వ్యక్తిని చేసి ఎన్నో సేవా కార్యక్రమాలను చేసేందుకు పునాది వేసింది. సంకల్పం ఉంటే సాధించ లేనిది లేదు అన్నదానికి ప్రత్యక్ష సాక్ష్యం బ్రాండెడ్ నారాయణ. చిన్నగా వ్యాపారం చేస్తూ జీవనోపాధి పొందాలన్న ఆ కుటుంబం .. ఎన్నో కష్టాలను సవాళ్లను ఎదురీది... (శ్రీ లక్ష్మీ శారీ సెంటర్) బ్రాండెడ్ నారాయణ ప్రారంభించి.. అనతి కాలంలోనే
తన వ్యాపార సామ్రాజ్యం దినదినాభివృద్ధి చెందుతూ అగ్రస్థానానికి చేరుకొంది.కూతురు అఖిల(బీటెక్), కొడుకు ఉమా విష్ణు(ఐదవ తరగతి), అల్లుడు యుగంధర్(పదవ తరగతి), కోడలు హారిక (డిగ్రీ కంప్లీట్), భవిష్యత్తులో వీరికి "బ్రాండెడ్ నారాయణ" బ్రాంచ్ లు అప్పచెప్పి వ్యాపార లావాదేవీలు నిర్వహించనున్నారు.

## (శ్రీ లక్ష్మీ శారీ సెంటర్ )బ్రాండెడ్ నారాయణ

**అనంతపురం ఫిబ్రవరి 09 (రిపబ్లిక్ ప్రత్యేక కథనం) :**

ఒక సాధారణ వ్యక్తి వస్త్ర సామ్రాజ్యంలో ఎదగాలంటే ఎన్నో సవాళ్లతో కూడిన లక్ష్యం నెరవేరుతుందో లేదో తెలియదు కానీ ఎన్నో ఆటుపోట్లాడును చవిచూడాల్సి వస్తుంది. వాటన్నిటిని ఎదురీది తట్టుకొని వస్త్ర సామ్రాజ్యంలో నిలతొక్కుకోవడం అంటే ఆశామాసి విషయం కాదు. అలాంటిది ఒక సాధారణ వ్యక్తి వస్త్ర సామ్రాజ్యంలో " బ్రాండెడ్ నారాయణ" గా పేరు ప్రఖ్యాతిగాంచి ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాలలో ఆయనకు వీరాభిమానుల మహిళలు ఎన్నో లక్షల మంది ఉన్నారు. తన సోషల్ మీడియా వేదికగా " బ్రాండెడ్ నారాయణ" అన్నా.. నాకు అన్నదమ్ములు ఎవరూ లేరు. మీరే నాకు ఒక అన్న అని మహిళలు అన్న సందర్భంలో... ఆయన మనసు చలించిపోయి... ఎన్నో వందల మహిళలకు తన సొంత డబ్బులతో సామూహిక సీమంతాలను చేసిన ఘనత ఆయనదే.

### ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహణ

అనాధాశ్రమం, ఒడిబియ్యం, సామూహిక సీమంతాలు తన ప్రబంధ హస్తాలతో ఎన్నో సేవా కార్యక్రమాలను తన సొంత డబ్బుతో నిర్విరామంగా నిర్వహిస్తున్న ఇంచు అయినా గర్వం లేని వ్యక్తిగా అక్క చెల్లెమ్మలకు సుపరిచితుడు బ్రాండెడ్ నారాయణ. తన సోషల్ మీడియా ఇన్స్టాగ్రామ్, ఫేస్ బుక్, యూట్యూబ్ చానల్లో తరచుగా కనిపిస్తూ కస్టమర్లను ఆకట్టుకుంటున్నారు. వీటిని సోషల్ మీడియా వేదికగా వీక్షించిన కస్టమర్లు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో అనంతపురం నగరం నడిబొడ్డున ఉన్న బ్రాండెడ్ నారాయణ (శ్రీ లక్ష్మీ శారీ సెంటర్ ) వద్ద తక్కువ ధరలకే విక్రయించి తిరిగి వారు తమ వ్యాపార లావాదేవీలను నైపుణ్యంతో పెంపొందించుకొని ఆర్థికంగా లబ్ధి పొందుతున్నారు. నాణ్యత ప్రమాణాలతో కూడిన వస్త్రాలను సిద్ధార్థ బ్రాండ్ శారీస్, శ్వేతాంబరి, దీప్ జ్యోతి బ్రాండ్ల పట్టు చీరలు



బయట సారీ సెంటర్ లు రూ. 4 వేలకు సేల్ చేస్తున్న వాటిని బ్రాండెడ్ నారాయణ కేవలం ఆ చీరలను 1200 రూపాయలకు మాత్రమే విక్రయిస్తున్నారు. డ్రెస్సెస్ రూ.250, టాప్స్ రూ.150, టీ షర్ట్స్ రూ.150, హోల్ సేల్ సారీస్ రూ.150 నుంచి 1000 రూపాయలకు అమ్మకాలు చేపడుతున్నారు. ఈ డ్రెస్సులను 12 సంవత్సరాల వయసున్న పిల్లల నుంచి పెద్దవారు వరకు విక్రయిస్తున్నారు.

### అక్క చెల్లెమ్మల హృదయాలలో సుస్థిర స్థానం

అనంతపురం ఓల్డ్ టౌన్ నీలం టాకీస్ కూడలిలో బ్రాండెడ్ నారాయణ (శ్రీ లక్ష్మీ శారీ సెంటర్) వస్త్రాలయంలో వ్యాపార లావాదేవీలు నిర్వహిస్తున్నారు. అయితే అక్క చెల్లెమ్మల హృదయాలలో సుస్థిర స్థానాన్ని సంపాదించుకున్న బ్రాండెడ్ నారాయణ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక మూడు రాష్ట్రాలలో తెలియని వారంటూ ఉండరు. వస్త్ర ప్రపంచంలో తనకంటూ ఒక ప్రత్యేక పేరు ప్రఖ్యాతిగాంచిన ఆయన నాణ్యత ప్రమాణాలతో కూడిన ఫ్యాన్సీ, పట్టుచీరలు తక్కువ ధరలకే హోల్ సేల్ రేట్లకు చీరలను విక్రయిస్తూ (శ్రీ లక్ష్మీ సారీ సెంటర్) బ్రాండెడ్ నారాయణగా ప్రసిద్ధి చెందారు.

### మహిళా ఆటో డ్రైవర్లకు ఉచితంగా చీరలను పంపిణీ

ఆరు నెలల క్రితం కడపలో 600 మంది గర్భవతులకు తన సొంత డబ్బులతో అంగరంగ వైభవంగా సామూహిక శ్రీమంతాలను ఘనంగా నిర్వహించారు.అంతకుముందు అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా సహృదయం కలిగిన వ్యక్తిగా " బ్రాండెడ్ నారాయణ" నగరంలోని మహిళా ఆటో డ్రైవర్లకు ఉచితంగా చీరలను పంపిణీ చేశారు. అంతకుముందు 50 సంవత్సరాలు గడిచిన మహిళలకు" బ్రాండెడ్ నారాయణ" ఆ మహిళలకు ఒక అన్నగా, ఓ సోదరుడిగా ఒడిబియ్యం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.

### ఒడిబియ్యం స్వీకరించిన మహిళల కళ్లల్లో ఆనందభాష్పాలు.

వారి మాటల్లోనే : మాకు పెళ్లయి 50 సంవత్సరాలు గడిచింది. కొంతమందికి అన్నలు లేరు. కొంతమందికి అన్నలు ఉన్నప్పటికీ వారు పట్టించుకోలేదని తీవ్ర



ఆవేదన వ్యక్తం చేసిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. అయితే ఒడిబియ్యం స్వీకరించిన మహిళలు వారి కళ్ళల్లో ఆనందభాష్పాలు రాలుతున్న సన్నివేశం చూస్తే మన కళ్ళల్లో నుంచి నీళ్లు అవంతకవే రాలుతున్నాయి. బంధాలు, బంధుత్వాలు ఉన్నప్పటికీ కొంతమంది మహిళలకు అన్నలు ఉన్నా పట్టించుకోక... లేనివారు.. మహిళలు వారి బాధను ఎవరికీ చెప్పుకోలేక తల్లాడినిల్లుతున్న సందర్భం అది. అయితే "నేనున్నా" అంటూ ఒక సోదరుడిగా ముందుకొచ్చిన "బ్రాండెడ్ నారాయణ" ఆ 50 సంవత్సరాలు నిండిన మహిళలకు ఒడి బియ్యం కార్యక్రమం ఘనంగా నిర్వహించి
ఎంతో మంచి పేరును సంపాదించుకున్నారు. సామూహిక ఒడిబియ్యం కార్యక్రమం చేయడం అంటే ఒక బృహత్తరమైన కార్యక్రమమే అని చెప్పవచ్చు.

### వస్త్ర సామ్రాజ్యంలో దూసుకుపోతున్న "బ్రాండెడ్ నారాయణ"

(శ్రీ లక్ష్మీ శారీ సెంటర్) బ్రాండెడ్ నారాయణ ప్రధాన కార్యాలయం అనంతపురం ఓల్డ్ టౌన్ నీలం టాకీస్. తాడిపత్రిలో మొదటి బ్రాంచ్ ను ప్రారంభించి విజయం సాధించారు. తిరిగి గుంతకల్ లో మరో బ్రాంచ్ ను త్వరలో ప్రారంభించనున్నారు. ఆయన మరెన్నో బ్రాంచ్ లను ప్రారంభించి ఘనవిజయం సాధించి అగ్రగామిక ఎదగాలి. ఒక వ్యక్తి ఎదగడానికి ఉన్నత ఆలోచనలే ముఖ్యం. వాటితోపాటు ఆచరణ ఇంకా ముఖ్యం. వీటికి తోడు
ఆ ఇంటి యజమానురాలు సహాయ సహకారాలు ఇంకా ఎంతో ముఖ్యం. తన భర్త అడుగుజాడల్లో నడుస్తూ "బ్రాండెడ్ నారాయణ" ఇంత ఘనవిజయం సాధించాడు అంటే .. ఆయనకు వెన్నుదన్నుగా నిలిచి సహాయ సహకారాలు అందించి ముందుకు తీసుకెళ్లడంలో ఆయన భార్య లక్ష్మీదేవి పాత్ర కీలకమే అని చెప్పవచ్చు. కూతురు అఖిల బిటెక్ చివరి సంవత్సరం చదువుతోంది. కొడుకు ఉమా విష్ణు ఐదవ తరగతి చదువుతున్నాడు. మేనల్లుడు యుగంధర్ పదవ తరగతి. హారిక డిగ్రీ కంప్లీట్ చేసింది.
భవిష్యత్తులో వీరు వ్యాపార సామ్రాజ్యంలో అడుగుపెట్టే అవకాశాలు మెండుగా ఉన్నాయి. ఎక్కడ ఏ బ్రాంచ్ నిర్వహించినా కూడా " బ్రాండెడ్ నారాయణ" పేరు మీదనే ప్రారంభిస్తారు."బ్రాండెడ్ నారాయణ మేరవ, భార్య లక్ష్మీదేవి మేరవ వీరు త్వరలో రైల్వే స్టేషన్ రూట్ గాంధీ బజార్లో రెండవ బ్రాంచ్ గుంతకల్లులో త్వరలో ప్రారంభించనున్నారు.

# విదేశాల్లో వెల్డింగ్ ఉద్యోగ అవకాశాల - అవగాహన సదస్సు

## రాయలసీమ నిరుద్యోగ యువత కోసం

## ఏ. గోవిందరాజులు(ఏపిఎస్ఎస్ డిసి)అసిస్టెంట్ డైరెక్టర్




**అనంతపురం ఫిబ్రవరి 09,(రిపబ్లిక్ న్యూస్):**
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యభివృది సంస్థ( ఏపి ఎస్ ఎస్ డి సి ), ఓవర్సీస్ మ్యాన్ పవర్ కంపెనీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్( ఓ ఎమ్ సి ఏ పి ), నేషనల్ అకాడెమీ ఆఫ్ కన్స్ట్రక్షన్(ఎన్ ఏ సి ) సంయుక్తంగా రాయలసీమ ప్రాంతంలోని నిరుద్యోగ యువతకోసం, ఇతరదేశాల్లో వెల్డింగ్, నిర్మాణరంగం నందు ఉద్యోగ అవకాశాలు మీద అవగాహన సదస్సును ఈ నెల 12న పులివెందుల లోని నేషనల్ అకాడెమీ ఆఫ్ కన్స్ట్రక్షన్(ఎన్ ఏ సి ) నందు వెల్డింగ్, నిర్మాణరంగం నందు విదేశాల్లో శిక్షణ ఇచ్చే సాఫ్కో ఇండస్ట్రియల్ ట్రైనింగ్, అసెస్మెంట్ వారి ద్వారా అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి 10వ తరగతి/ఐటీఐ/డిప్లొమా/ఇంజనీరింగ్ చదివి 19 సం॥ నుండి 45 సం॥ వయస్సు గల అభ్యర్థులు హాజరయ్యి సదస్సును సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఇతర వివరాలకు నాక్ బిల్డింగ్, పులివెందుల నందు లేదా 9000517637, 9701271158 ను సంప్రదించగలరు. ఏ. గోవిందరాజులు,అసిస్టెంట్ డైరెక్టర్, నేషనల్ అకాడెమీ ఆఫ్ కన్స్ట్రక్షన్,అనంతపురం జిల్లా.

# 17న ఉపాధి హామీ పరిరక్షణ యాత్ర విజయవంతానికి కాంగ్రెస్ జిల్లా పర్యటన

## జిల్లా పర్యవేక్షణ కమిటీ వాహనాలను ప్రారంభించిన డీసీసీ అధ్యక్షులు బి.క్రాంతి నాయుడు

**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ ఫిబ్రవరి 9)**
ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు శ్రీమతి వైఎస్ షర్మిల రెడ్డి చేపట్టిన ఉపాధి హామీ పథకం పరిరక్షణ యాత్రను విజయవంతం చేయాలనే లక్ష్యంతో కర్నూలు జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో జిల్లా పర్యవేక్షణ కమిటీ పర్యటన సోమవారం ప్రారంభమైంది.
కర్నూలులోని జిల్లా కాంగ్రెస్ కార్యాలయం నుంచి పర్యవేక్షణ కమిటీ వాహనాలను జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు బి. క్రాంతి నాయుడు, మాజీ ఎమ్మెల్సీ, ఏఐసీసీ సభ్యులు ఎం. సుధాకర్ బాబు, సిటీ కాంగ్రెస్ అధ్యక్షులు షేక్ జిలాని భాష జెండా ఊపి ప్రారంభించారు.
ఈ సందర్భంగా బి. క్రాంతి నాయుడు మాట్లాడుతూ, మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని బీజేపీ ప్రభుత్వం పేరుమార్పుతో బలహీనపరుస్తోందని



ఆరోపించారు. ఈ పథకం ద్వారా ఉపాధి హామీ కూలీలకు అన్యాయం జరుగుతోందని, పథకాన్ని యథావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు.అఖిల భారత కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, పార్లమెంటులో ప్రతిపక్ష నాయకులు రాహుల్ గాంధీ స్ఫూర్తితో, వైఎస్ షర్మిల రెడ్డి చేపట్టిన ఈ యాత్ర ఈ నెల 2వ తేదీన అనంతపురం జిల్లా బండ్లపల్లి గ్రామం నుంచి ప్రారంభమైందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతున్న ఈ యాత్ర కర్నూలు జిల్లాలో ఈ నెల 17న జరగనున్న నేపథ్యంలో, జిల్లా వ్యాప్తంగా ఏడు



అసెంబ్లీ నియోజకవర్గాల్లో పర్యవేక్షణ కమిటీ పర్యటించి పార్టీ నాయకులు, కార్యకర్తలను సమన్వయం చేస్తుందని చెప్పారు.
గ్రామీణ ప్రాంతాల్లో రైతులు, ఉపాధి హామీ కూలీలతో నేరుగా మాట్లాడి పథకం ఉద్దేశాలను వివరించి అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు.
ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ ఎం. సుధాకర్ బాబు, సిటీ కాంగ్రెస్ అధ్యక్షులు షేక్ జిలాని భాష, ఐఎన్టీయూసీ రాష్ట్ర అధ్యక్షులు సయ్యద్ ఖాద్రి బాషా, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు బి. మహేంద్ర నాయుడు, వివిధ అనుబంధ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# క్షేత్రస్థాయి పర్యటనలతోనే ప్రజా సమస్యల గుర్తింపు సాధ్యం

## నగరపాలక అధికారులు రోజూ కాలనీల్లో పర్యటించాలి - కమిషనర్ పి. విశ్వనాథ్





**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ ఫిబ్రవరి 9)**
నగరపాలక అధికారులు, సచివాలయ సిబ్బంది ప్రతిరోజూ క్షేత్రస్థాయిలో పర్యటించినప్పుడే ప్రజా సమస్యలను సకాలంలో గుర్తించి పరిష్కరించవచ్చని నగరపాలక సంస్థ కమిషనర్ పి. విశ్వనాథ్ పేర్కొన్నారు. సోమవారం నగర పరిధిలోని 34వ వార్డు నిర్మల్ నగర్‌లో ఆయన పర్యటించి వివిధ కాలనీల్లో పరిస్థితులను పరిశీలించారు.
ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, ఉద్యానవనాల కోసం కేటాయించిన స్థలాలు అన్యాక్రాంతం కాకుండా సంబంధిత విభాగాల అధికారులతో సమన్వయం చేసుకుని పరిరక్షించాలని సూచించారు. డ్రైనేజీ కాలువల్లో తాగునీటి పైపులైన్లు ఉండకూడదని, నీటి కలుషితానికి ఎట్టి పరిస్థితుల్లోనూ అవకాశం కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇటువంటి సమస్యలు క్షేత్రస్థాయిలో పర్యటించినప్పుడే బయటపడతాయని తెలిపారు.
నాల్గవ పట్టణ పోలీస్ స్టేషన్ ఎదురు రహదారిలో డ్రైనేజీ కాలువ అధ్వాన్నంగా ఉండటంపై కమిషనర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పారిశుద్ధ్య సమస్యలను సమన్వయంతో పరిష్కరించాలని, బాధ్యతారాహిత్యంగా వ్యవహరించడం తగదని హెచ్చరించారు. ప్రతి రోజు ఉదయం అధికారులు కాలనీల్లో పర్యటించాల్సిందేనని స్పష్టం చేశారు.
ఈ కార్యక్రమంలో ప్రజారోగ్య అధికారి డాక్టర్ నాగ ప్రసాద్, డిసిపి వెంకటరమణ, ఎంఈ మనోహర్ రెడ్డి, డిఈఈ కృష్ణలత, పట్టణ ప్రణాళిక అధికారి అంజాద్ బాష, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ అనిల్ తదితరులు పాల్గొన్నారు.

# జీఎస్డీపీ వృద్ధి నుంచి శాంతిభద్రతల వరకు సమగ్ర సమీక్ష

## స్వర్ణాంధ్ర 2047 విజన్ లక్ష్యాల సాధనకు మంత్రులుకార్యదర్శులతో సీఎం చంద్రబాబు వీడియో కాన్ఫరెన్స్





**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ ఫిబ్రవరి 9)**రాష్ట్ర సచివాలయం నుండి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన మంత్రులు, కార్యదర్శులతో కీలక సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా స్థాయి నుంచి వర్చువల్ విధానంలో అధికారులు పాల్గొన్నారు.కర్నూలు జిల్లా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి, జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్, జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ , అన్ని శాఖల జిల్లా అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.సమావేశంలో రాష్ట్ర జీఎస్డీపీ వృద్ధిరేటు, స్వర్ణాంధ్ర 2047 విజన్ లక్ష్యాల సాధనలో భాగంగా పది సూత్రాల అమలు, రియల్ టైమ్ గవర్నెన్స్ వ్యవస్థ, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు, వన్ ఫ్యామిలీ వన్ ఎంట్రప్రెన్యూర్ విధానం అమలు, ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్, అలాగే శాంతిభద్రతల అంశాలపై ముఖ్యమంత్రి సమగ్రంగా సమీక్షించారు.ప్రభుత్వ విధానాలు క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలయ్యేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సీఎం చంద్రబాబు నాయుడు సూచించారు. అభివృద్ధి, పెట్టుబడులు, ఉపాధి అవకాశాల సృష్టిలో జిల్లాల పాత్ర కీలకమని ఆయన స్పష్టం చేశారు.

# పూసులూరు గ్రామంలో ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కును అందజేసిన ఎన్‌ఎండి ఫిరోజ్



**నంద్యాల బ్యూరో ఫిబ్రవరి 9 (రిపబ్లిక్ న్యూస్)**
నంద్యాల మండలం పూసులూరు గ్రామానికి చెందిన దోర్నాసి హుస్సేనమ్మ తీవ్ర అనారోగ్యంతో ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందారు.చికిత్స అనంతరం ముఖ్యమంత్రి సహాయనిధి కోసం నంద్యాల ఎమ్మెల్యే ఎన్‌ఎండిఫరూక్ గారి కార్యాలయంలో దరఖాస్తు చేయగా రూ. 66,800/- అక్షరాల: అరవై ఆరు వేల ఎనిమిది వందల రూపాయలు మంజూరు కావడం జరిగింది.ఈ మేరకు తెలుగుదేశం పార్టీ నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్‌ఎండి ఫిరోజ్ పూసులూరులోని స్వయంగా వారి స్వగృహానికి చేరుకొని, హుస్సేనమ్మ గారి యోగక్షేమాలు అడిగి తెలుసుకొని, మంజూరైన చెక్కును వారికి అందజేశారు.

# స్వచ్ఛతే లక్ష్యం సమస్యల పరిష్కారమే గమ్యం

## దీర్ఘకాలిక పెండింగ్ అంశాలపై అధికారులతో సమీక్షించిన కమిషనర్ పి. విశ్వనాథ్



**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ ఫిబ్రవరి 9)**
కర్నూలు నగరపాలక సంస్థ పరిపాలనలో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు స్పష్టమైన చర్యలు తీసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ పి. విశ్వనాథ్ అధికారులను ఆదేశించారు. సోమవారం వెంకటరమణ కాలనీలోని నగరపాలక కార్యాలయంలో ఇంజినీరింగ్, ప్రజారోగ్య, అకౌంట్స్ విభాగాల అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో వివిధ అంశాలపై సమగ్రంగా చర్చించారు.
ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, వివిధ కారణాలతో పెండింగ్‌లో ఉన్న గుత్తేదారుల బిల్లుల నమోదు ప్రక్రియను వేగవంతం చేసి, సకాలంలో మంజూరు అయ్యేలా చర్యలు చేపట్టాలని సూచించారు. అవసరమైతే తాత్కాలిక సిబ్బందిని నియమించి ప్రక్రియను పూర్తి చేయాలన్నారు.డ్రైనేజీ కాలువల్లో ఉన్న తాగునీటి పైప్‌లైన్లను వెంటనే గుర్తించి తొలగించాలని, ఇందువల్ల ప్రజారోగ్య సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే స్వచ్ఛ సర్వేక్షన్ మార్గదర్శకాల ప్రకారం అన్ని కార్యక్రమాలను కట్టుదిట్టంగా అమలు చేయాలన్నారు.స్వచ్ఛతపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు గోడచిత్రాలు, సుందరీకరణ పనులు, భవన నిర్మాణ వ్యర్థాల సమర్థ నిర్వహణ, పాఠశాలల్లో తడిపొడి చెత్త స్వీయ నిర్వహణపై విద్యార్థులకు అవగాహన కల్పించడం, పారిశుద్ధ్య కార్మికుల సంక్షేమానికి లోన్ మేళాలు నిర్వహించడం వంటి కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. స్వచ్ఛతలో నగరాన్ని టాప్‌లో నిలపడానికి అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కమిషనర్ సూచించారు.ఈ సమావేశంలో డిప్యూటీ కమిషనర్ సతీష్ కుమార్ రెడ్డి, ఎస్ఈ రమణమూర్తి, ప్రజారోగ్య అధికారి డాక్టర్ నాగ ప్రసాద్, కార్యదర్శి నాగరాజు, ఎంఈలు మనోహర్ రెడ్డి, గిరిరాజ్, డీఈఈలు కృష్ణలత, నరేష్, సూపరింటెండెంట్ మంజూర్ బాష తదితరులు పాల్గొన్నారు.

# వేణుగోపాలస్వామి ఆలయంలో విశేష పూజలు

**చౌడేపల్లి ప్రతినిధి ఫిబ్రవరి 09 రిపబ్లిక్ న్యూస్**
మండల కేంద్రమైన చౌడేపల్లి లో గల శ్రీ రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాల స్వామి ఆలయంలో సోమవారం విశేష పూజలు నిర్వహించారు. మాఘమాసం అష్టమైన పురస్కరించుకొని ఆలయ ప్రధానార్చకుడు వశిష్టాచార్యుల ఆధ్వర్యంలో ఉదయాన్నే స్వామి అమ్మవారికి అభిషేకము అలంకరణ గావించారు. వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. వారికి ఆలయ నిర్వాహకులు స్వామివారి పవిత్ర తీర్థ ప్రసాదాలు అందించారు.



# అభివృద్ధి పనుల్లో స్పష్టమైన పురోగతి చూపించాలి

## మార్చి కలెక్టర్ల సమావేశం నాటికి అన్ని శాఖల్లో ఫలితాలు కనిపించాలి : జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి



**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ ఫిబ్రవరి 9)**
జిల్లాలోని అన్ని శాఖలు చేపడుతున్న అభివృద్ధి పనుల్లో ఖచ్చితంగా పురోగతి కనబర్చాలని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి అధికారులను ఆదేశించారు. సోమవారం ముఖ్యమంత్రి వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో సంబంధిత శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు.
మార్చిలో జరిగే కలెక్టర్ల సమావేశం నాటికి అన్ని విభాగాల్లో అభివృద్ధి స్పష్టంగా కనిపించాలన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమాలు బాగున్నప్పటికీ, జాబ్ మేళాల ద్వారా కనీసం 7,000 నుంచి 8,000 మందికి ఉపాధి కల్పించేలా లక్ష్యాలు నిర్దేశించుకోవాలని సూచించారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా వచ్చే సమస్యల పరిష్కారంలో పూర్తి స్థాయి పురోగతి ఉండాలని తెలిపారు.సాంఘిక, గిరిజన, మైనార్టీ, బీసీ సంక్షేమ వసతి గృహాల్లో టాయిలెట్లు, తాగునీటి వసతుల కోసం నిధులు మంజూరు చేస్తామని, తక్షణమే ప్రతిపాదనలు పంపాలని ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈ అధికారులను ఆదేశించారు. వసతి గృహాల్లో మెనూ అమలుపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.గర్భిణీలు, బాలింతలు, 06 ఏళ్ల పిల్లలకు అందించే సేవలపై ప్రజల్లో సానుకూల స్పందన పెరగాలని ఐసిడిఎస్ అధికారులను ఆదేశించారు. గతంలో మాస్ డ్రైవ్ ద్వారా 85 బాల్య వివాహాలను అడ్డుకున్నామని, అదే విధంగా ఎట్టి పరిస్థితుల్లోనూ బాల్య వివాహాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.డి.ఆర్.డి.ఏ, సోషల్ వెల్ఫేర్, బీసీ వెల్ఫేర్, అగ్రికల్చర్, డీఈఓ తదితర అన్ని విభాగాల్లో ప్రజల నుంచి సానుకూల స్పందన పెరగాలన్నారు. యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే, పి4, బయోమెట్రిక్ అప్డేషన్, ఈ-కెవైసీ వంటి ఐదు పారామీటర్లలో జిల్లా వెనుకబడి ఉందని, పురోగతి సాధించాలని జిల్లా పరిషత్ సీఈఓను ఆదేశించారు.
తాగునీటి సరఫరాలో లీకేజీలు, మరమ్మతులు, సిఎస్ఆర్ నిధుల వినియోగంపై దృష్టి పెట్టాలని సూచించారు. నీటి సరఫరాలో నిర్లక్ష్యం చేస్తే సంబంధిత సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. హౌసింగ్ విభాగంలో పిఎంఏవై-1, పిఎంఏవై-2 పథకాల కింద పెండింగ్ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని తెలిపారు. పెన్షన్ల పంపిణీలో జిల్లా ర్యాంకింగ్ మెరుగుపడేలా చర్యలు తీసుకోవాలన్నారు.వరి సాగు తగ్గించి ఉద్యానవన పంటలు, ప్రకృతి వ్యవసాయం వైపు రైతులను ప్రోత్సహించాలని వ్యవసాయ అనుబంధ శాఖలను ఆదేశించారు.ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్, హౌసింగ్ పీడీ చిరంజీవి, జిల్లా పరిషత్ సీఈఓ నాసర రెడ్డి తదితర అధికారులు పాల్గొన్నారు.

# పాదయాత్రీకులకు మజ్జిగ పంపిణీ

## హర్షం వ్యక్తం చేస్తున్న శివ స్వాములు



**బండి ఆత్మకూరు, ఫిబ్రవరి 9, (రిపబ్లిక్ న్యూస్):-**
మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకొని శ్రీశైలం క్షేత్రానికి కాలినడకన వెళ్లే శివ స్వాములు, సాధారణ భక్తులకు బండి ఆత్మకూరు మండలం, భోజనం గ్రామ యువకులు మజ్జిగ పంపిణీ చేశారు. సోమవారం గ్రామానికి చెందిన అబ్దుల్లా, హరిబాబు, సూరిబాబు,భార్గవ,మౌలాలి, బాల వెంకటలు శ్రీశైలం క్షేత్రానికి కాలినడకన నడుచుకుంటూ వెళ్లే శివ స్వాములు, సాధారణ భక్తులకు పెద్దదేవలాపురం సమీపంలోని భోజనం గ్రామ బాట వద్ద స్వచ్ఛందంగా చలివేంద్రాన్ని ఏర్పాటు చేసి మజ్జిగ పంపిణీ చేశారు. ముఖ్యంగా ఎండ తీవ్రతను దృష్టిలో పెట్టుకొని గ్రామానికి చెందిన పలువురు యువకులు పాదయాత్రగా వెళ్లే శివ స్వాములకు ఇలాంటి సేవా కార్యక్రమాలు చేయడం సంతోషకరమని శివ స్వాములు తెలిపారు. సుదూర ప్రాంతాల నుంచి కాలినడకన వెళ్లే వారి కోసం దాతలు మార్గమధ్యలో ఇలాంటి అన్న ప్రసాద వితరణ, చలివేంద్రాలు, మజ్జిగ పంపిణీ చేయడం వంటి సేవా కార్యక్రమాలు తమకు ఎంతో ఉపశమనాన్ని కలిగిస్తాయనీ శివ స్వాములు హర్షం వ్యక్తం చేశారు.

# ఘనంగా ఫాదర్ దేవదాస్ గారి 66వ జ్ఞాపకార్థ కూడిక

## జిల్లా పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నిర్వహణ



**అనంతపురం ఫిబ్రవరి 09,(రిపబ్లిక్ న్యూస్):**
అనంతపురం జిల్లా పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ 68వ సర్వసభ్య సమావేశాన్ని పాస్టర్ రెడ్డి వారి నెహెమ్యా నాగరాజు వారి ఆధ్వర్యంలో పాస్టర్ చార్లెస్ నాయక్ గారి ప్రార్థనతో ప్రారంభించారు.సోమవారము అనంతపురం టీవీ టవర్ దగ్గర, సంతగురు రవిదాసు కాలనీలో 9: 30 గంటలకు బైబిల్ మిషన్ చర్చ్ లో సమావేశం జరిగింది.
దైవ సేవకులు పాటలు పాడి దేవుని స్తుతించారు. పాస్టర్. రెడ్డి వారి నెహెమ్యా నాగరాజు ఆరాధన జరిపించారు.

**వాక్యానుసారముగా జీవించువారు మరల్చబడతారు**
ముఖ్య ప్రసంగీకులు ప్రొఫెసర్. కొడాలి విజయ్ కుమార్ ఆంధ్ర ప్రదేశ్ క్రైస్తవ ప్రభుత్వ ప్రతినిధి మాట్లాడుతూ
“దేవుని పరిచర్య కొరకు ఎన్నుకొనబడినవారన్నారు. దేవుడు చెప్పిన స్థలమునకు వెళ్లి సేవ చేస్తారు కానీ, స్వకీయమైన ఆలోచనలతో సేవ చేయువారు, తమకు అనుకూలమైన స్థలములో, స్థితిలో పరిచర్య చేయుట వలన దేవుని వాక్యానుసారముగా పిలువబడిన వారిని వారి పిలుపు నుండి తప్పింపబడుటకు సాధనాలుగా వాడబడతారన్నారు. వారి వలన వాక్యానుసారముగా జీవించుచున్నవారు మరల్చబడతారు, దేవుని రాజ్యమునకు వారు హానికారులుగా ఉంటారన్నారు. వారు పరిస్థితులను వారికి అనుకూలముగా మార్చుకుంటారు.



న్యాయాధిపతుల గ్రంథము నుండి మీకాను, యవ్వనస్తుడైన లేవీయుడును ఉదహరించారన్నారు.

**అయ్యగారి సేవా పరిచర్య విషయములు**
అసోసియేషన్ అధ్యక్షులు రెవ. బందెల రాజు బైబిలు మిషను ఏ ఓ మాట్లాడుతూ ఫాదర్ ఎం దేవదాస్ అయ్యగారి గూర్చిన సేవా పరిచర్య విషయములు సభకు తెలియజేశారు. ఈ సందర్భంగా బైబిల్ మిషన్ నాయకులకు కృతజ్ఞతలు తెలియజేశారు.అసోసియేషన్ సెక్రటరీ పాస్టర్. జి ఆర్ ఆనంద్ , ట్రెజరర్ పాస్టర్. కె. జీవన్ బాబు, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ పాస్టర్. శాంత వర్ధన్, పాస్టర్ లాబాన్ , పాస్టర్ విజయ్ సింహ తదితరులు పాల్గొన్నారు. సలహాదారులు పాస్టర్ జీవ ప్రకాష్ ,పాస్టర్ శ్యాంసన్ నాయక్ ,పాస్టర్ చెల్లా కిషోర్, పాస్టర్ వై పి బాబు, లోకేష్ అభిమాన సంఘం జాతీయ అధ్యక్షులు బ్రదర్ ఆనంద్ రెడ్డి పాల్గొన్నారు.

**చర్చి నిర్మాణం నిమిత్తం ఆర్థిక సహాయం**
పాస్టర్ తిమోతి ఒంటిమిట్ట కళ్యాణ దుర్గం చర్చి నిర్మాణం నిమిత్తము ఆర్థిక సహాయము మొత్తము రూ.15 వేలు, రూ.10 వేలు అసోసియేషన్, అధ్యక్షులు రెవ. బందెల రాజు రూ.5 వేలు ప్రొఫెసర్. కొడాలి విజయ్ కుమార్ చేతుల మీదుగా అందజేశారు. పాస్టర్ వై పి బాబు ప్రార్థించగా, రెవరెండ్ దైవ రత్నం ఆశీర్వాద ప్రార్థన జరిగించారు. తదనంతరం అతిథులను మూమెంటో శాలువాతో సత్కరించారు. ప్రేమ విందుతో కార్యక్రమం ముగిసింది.

# అందోల్ గడ్డమీద గులాబీ జెండా ఎగిరేస్తాం.

## బిఆర్ఎస్ పార్టీ 8వార్డ్ అభ్యర్థి నాగరత్నం గౌడ్ భవాని

**అందోల్ ప్రతినిధి ఫిబ్రవరి 9( రిపబ్లిక్ న్యూస్)**
అందోల్ జోగిపేట మున్సిపల్ పరిధిలో ఈసారి 8 వార్డులో గులాబీ జెండా ఎగరేస్తామని బి ఆర్ ఎస్ 8వ వార్డ్ అభ్యర్థి నాగరత్నం గౌడ్ భవాని దిమా వ్యక్తం చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా అందోల్ 8వార్డు అభ్యర్థి స్థానికంగా ఉంటూ ప్రజల సమస్యల మీద అవగాహన ఉన్న వ్యక్తి యువ నాయకుడుఅని వారు అన్నారు. బిఆర్ఎస్ కౌన్సిలర్ అభ్యర్థి నాగరత్నం గౌడ్ భవాని కారు గుర్తుపై ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు నాయకులు యువకులు మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు



# ప్రమాదాల నివారణకు హెల్మెట్ ధరించండి

### అతిక్రమిస్తే కఠిన చర్యలు,- ఎస్సై మహేష్ నాయుడు.




**ఓబులవారిపల్లి ఫిబ్రవరి 9 రిపబ్లిక్ న్యూస్.**

ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల నివారణకు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని, ఆచక్రమించి ఎవరైనా వాహనాలు నడిపినట్లయితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై మహేష్ నాయుడు అన్నారు, వివరాల్లోకి వెళితే ఓబులవారిపల్లె మండలం చిన్నఓరంపాడు కడప చెన్నై జాతీయ రహదారి ప్రభుత్వ జూనియర్ కళాశాల సమీపాన సబ్ ఇన్స్పెక్టర్ మహేష్ నాయుడు ఆధ్వర్యంలో ఓబులవారిపల్లె పోలీసులు వాహనాల తనిఖీలు నిర్వహించడం జరిగినది, తనిఖీలలో భాగంగా హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనదారులను పట్టుకొని లైసెన్స్, ఆర్ సి తదితర పత్రాలను తనిఖీ చేసి వాహనదారులకు కౌన్సిలింగ్ ఇవ్వడం జరిగినది హెల్మెట్ ధరించని పలువురు వాహనదారులపై జరిమానా విధించిన అనంతరం హెల్మెట్ లేకుండా వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమని ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని వాటి నివారణ కొరకు హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలని అతిక్రమించి హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని వాహనదారులను హెచ్చరించారు

# కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వం ఆర్డిటికీ మొండిచేయి

### బీఎస్పీ పార్టీ నాయకులు ఆగ్రహం




**గుత్తి ఫిబ్రవరి 09 (రిపబ్లిక్ న్యూస్)**

అనంతపురం జిల్లా గుత్తి పట్టణంలోని బీఎస్పీ పార్టీ రాయలసీమ ఇన్చార్జ్ గద్దల నాగభూషణం గుంతకల్ ఇంచార్జ్ విజయ్ మండల నాయకుడు రామాంజనేయులు మీడియా సమావేశం నిర్వహించి వారు మాట్లాడుతూ వివిధ ప్రాంతాలలో ఎస్సీ ఎస్టీ బీసీ అట్టడుగు వర్గాలకు చెందిన వారిని ఆర్డిటి సమస్త విద్యా వైద్యం ఉపాధి అందిస్తుంది కానీ గత మూడు సంవత్సరాలుగా ఆర్డిటికీ ఎఫ్ సి ఆర్ ఏ రెన్యూవల్ చెయ్యడం లేదు అనంతపురం జిల్లాలో ఆర్డిటి సమస్త నుంచి లక్షల మంది ప్రజలు లబ్ధి పొందారు రెండు మూడు సార్లు కలెక్టరేట్ ముట్టడి చేస్తే ఈ స్పందనని రాష్ట్ర ప్రభుత్వానికి తద్వారా కేంద్ర ప్రభుత్వానికి తెలియజేశారు ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ ఆర్డిటికీ ఎఫ్ సి ఆర్ ఏ రెన్యువల్ ఎటువంటి డొక్కా లేదని కేంద్ర ప్రభుత్వం ఎంపీ తో ఓం శాఖామంత్రి అమిత్ షా ప్రధానమంత్రి సానుకూలంగా స్పందించినారు త్వరలోనే ఆర్డిటికీ పూర్వవైభవం వస్తుందని అనంతపురం జిల్లాలోని ఆర్డిటి నిరంతరం సేవలు కొనసాగుతాయని ఐటి శాఖ మంత్రి నారా లోకేష్ తెలియజేశారు కానీ రెండు నెలలు గడుస్తున్నా ఆర్ డి టి ఆస్తులు అమ్ముకొని ఆర్డిటి ఇకమీదట ఉండకపోవచ్చు కానీ కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వం ఆర్డిటికీ ఎఫ్ సి ఆర్ ఏ రెన్యువల్ గురించి పట్టించుకోవడం లేదు రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వం మనువాది ప్రభుత్వాలు అట్టడుగు వర్గాలు ఎస్సీ ఎస్టీ బీసీలు కులవృత్తి చేసుకొని ఉండాలి విద్యా వైద్యం ఉపాధి అందటానికి వీలు లేదు ఆర్డిటి ఉంటే విద్య వైద్యం ఉపాధి కల్పిస్తుందని ఇంటర్ నుంచి పీజీ వరకు ఆర్డిటి అందిస్తుంది విదేశాలలో విద్య డాక్టర్లు ఇంజనీర్లు వివిధ ఆర్డిటి సమస్త ద్వారా ఎంతోమంది ఉద్యోగాలు వచ్చాయని ఆర్ డి టి సంస్థ ఎస్సీ ఎస్టీ బీసీ అట్టడుగు వర్గాల వారిని అన్ని రంగాలలో ముందుకు తీసుకు వెళుతుందని ప్రభుత్వం చేయలేని పని ఆర్డిటి చేస్తుందని అలాంటి ఆర్డిటిని రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వం ఎఫ్ సి ఆర్ ఏ రెన్యువల్ చేయకపోవడం ఎంతో బాధాకరమైన విషయం అని ప్రతి ఒక్కరూ ఆర్ డి టి నుంచి లబ్ధి పొందినవారు రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వంపై మనమంతా కలిసి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని వారు తెలియజేశారు ఈ కార్యక్రమంలో బీఎస్పీ పార్టీ రాయలసీమ ఇన్చార్జ్ గద్దల నాగభూషణం గుంతకల్ ఇన్చార్జి విజయ్ గుత్తి మండలం నాయకుడు రామాంజనేయులు సుధాకర్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు

# అక్రమ నాటు సారా పై చెక్



**గుత్తి ఫిబ్రవరి 09 (రిపబ్లిక్ న్యూస్)**

అనంతపురం జిల్లా గుత్తి మండలంలోసోమవారం సమాచారం మేరకు, గుత్తి పోలీస్ స్టేషన్ పరిధిలో ఇన్స్పెక్టర్ రామారావు ఆదేశాల మేరకు, ఎస్.ఐ కే. సురేష్ , పోలీస్ సిబ్బందితో కలిసి బేతపల్లి గ్రామంలో దాడులు నిర్వహించాము. ఈ దాడులలో నాటు సారా అక్రమంగా అమ్ముతున్న లాలప్ప అనే వ్యక్తిని పట్టుకొని, అతని వద్ద నుండి సుమారు ఏడు (7) లీటర్ల నాటు సారాను స్వాధీనం (సీజ్) చేసుకోవడం జరిగింది. అనంతరం నిందితుడిపై చట్టప్రకారం కేసు నమోదు చేయడం జరిగింది.


నాటు సారా వల్ల ప్రజల ఆరోగ్యం ప్రమాదంలో పడే అవకాశం ఉన్నందున, ఇలాంటి అక్రమ కార్యకలాపాలపై కఠిన చర్యలు తీసుకుంటామని గుత్తి పోలీసులు హెచ్చరించారు. ప్రజలు కూడా నాటు సారా తయారీ, అమ్మకాలు జరుగుతున్నట్లు సమాచారం ఉంటే పోలీస్ శాఖకు తెలియజేయాలని కోరారు.

# 15వ వార్డు ప్రజలకు మాటిస్తున్న.

### వార్డు అభివృద్ధి లో ముందు ఉంచుతా.

### ఇంటింటి ఆడపడుచులు వీర తిలకం దిద్ది ఆశీర్వదించిన అక్క చెల్లెమ్మలు.

### అధికార పార్టీకి ఓటేస్తే వార్డు అభివృద్ధి. -కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థి చిట్టిబాబు.





**ఆందోల్ నియోజకవర్గం ప్రతినిధి ఫిబ్రవరి 9( రిపబ్లిక్ న్యూస్**

రాష్ట్రంలో అధికారంలో ఉన్న పార్టీని స్థానిక ఎన్నికల గెలిపిస్తేనే అందోల్ జోగిపేట పూర్తిస్థాయి అభివృద్ధి సాధ్యపడుతుందని కాంగ్రెస్ పార్టీ ఓటేసి గెలిపిస్తేనేమి అభివృద్ధి బాధ్యత మాది అంటూ కాంగ్రెస్ బలపరిచిన కౌన్సిలర్ అభ్యర్థి చిట్టిబాబు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలు అమలు చేస్తూ ప్రతి ఇంటికి సంక్షేమం ప్రతి వార్డుకు అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పాలకొనసాగుతుందన్నారు. మంత్రి దామోదర రాజనర్సింహ అభివృద్ధి పథంలో ముందు ఉంచుతున్నారని ఆయన అన్నారు. 150 పడక ఆసుపత్రి, నర్సింగ్ కాలేజ్, విద్యాసంస్థలు శ్రీకారం చుట్టిన ఘనత మంత్రి దామోదర్ రాజనర్సింహది అని కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థి చిట్టిబాబు అన్నారు.

# మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి కర్రు కాల్చి వాత పెట్టండి

**ఆందోల్ నియోజకవర్గం ప్రతినిధి ఫిబ్రవరి 9( రిపబ్లిక్ న్యూస్)**

జోగిపేట పట్టణల లోని 11వ, 12వ,వార్డుల్లో ప్రచార కార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్ గారితో కలసి పాల్గొన్నసంగారెడ్డి జిల్లా ఎస్సి ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ మనిటరింగ్ కమిటీ సభ్యులు కాశపాగ ఇమ్మయ్య గులాబీ పార్టీకి బ్రహ్మరథం పడుతున్న వార్డు ప్రజలు తెలంగాణకు మేలు జరగాలంటే మన బీఆర్ఎస్ పార్టీ కారు గుర్తుకు ఓటు వేయాలని ఓటర్లకు సూచించారు. కాంగ్రెస్..ఢిల్లీకి సంచులు మోసే పార్టీ అని అన్నారు. ఎట్టి పనికైనా మట్టి పనికైనా మన తెలంగాణ పార్టీ ఉండాలని పేర్కొన్నారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా జోగిపేట పట్టణంలోని 11. 12 వ, వార్డుల్లో ఇమ్మయ్య పర్యటించారు. ఆయా వార్డుల్లో గడపగడపకు వెళ్లి బీఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థులకు కారు గుర్తుపై ఓటు వేయాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆరు



గ్యారంటీలతో 420 హామీలతో ప్రజలను మభ్యపెట్టి తెలంగాణ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీకి జోగిపేట పట్టణ ఓటర్లు వారి ఓట్లను బీఆర్ఎస్ పార్టీ కారు గుర్తుకు నమోదు చేసి బుద్ధి చెప్పాలని కోరారు. అందోల్ నియోజకవర్గ అభివృద్ధి బీఆర్ఎస్ పార్టీ తోనే సాధ్యం అన్నారు. అందోల్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిన ఘనత మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్ కే దక్కుతుందని అయన అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత అందోల్ అభివృద్ధిలో తిరోగమనం పొంది 20 ఏండ్లు వెనక్కి వెళ్ళిందన్నారు. మన ఆత్మ గౌరవాన్ని ఢిల్లీలో తాకట్టుపెట్టిన రేవంత్ సర్కారుకు తగిన గుణపాఠం చెప్పాలని అన్నారు. ఈనెల 11న జరగనున్న మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ కారు గుర్తుకు ఓటేయాలని వార్డు ప్రజలను కోరారు. జోగిపేట పురపీఠంపై గులాబీ జెండా ఎగురవేయాలని ఆకాంక్షించారు. బీఆర్ఎస్ హయాంలో జరిగిన అభివృద్దే తమ అభ్యర్థుల గెలుపునకు దోహదపడుతుందన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ కౌన్సిలర్ అభ్యర్థులను బంపర్ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఇ కార్యక్రమంలో చౌటకుర్ మండల అధ్యక్షులు చౌకంపల్లి శివకుమార్ ఉపాధ్యక్షులు మల్లారెడ్డి గ్రామ అధ్యక్షులు అనంత్ తదితరులు పాల్గొన్నారు

# ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తే దాడుల?

### జర్నలిస్టులపై దాడి అమానుషమైన చర్య - ప్రజా సంఘాలు -బాధితుడు పై కౌంటర్ కేసు నమోదు చేయడం సిగ్గు చెటు

**బండి ఆత్మకూరు, ఫిబ్రవరి 9, (రిపబ్లిక్ న్యూస్) :-** మండలంలోని టుడే టీవీ రిపోర్టర్ గా పనిచేస్తున్న ఎం.ఆంజనేయులు పై మండల టిడిపి అధ్యక్షుడు ముమ్మడి నాగ కృష్ణారెడ్డి సహకార సంఘంలో శనివారం దాడికి పాల్పడడం హేయమైన చర్య అని ఎస్డిపిఐ పార్టీ శ్రీశైలం నియోజకవర్గం అధ్యక్షులు ఆరిఫ్ హుస్సేన్, సిపిఎం నాయకులు ఆరోపించారు. ఆంజనేయులుపై దాడికి నిరసనగా సోమవారం బండి ఆత్మకూరు బస్టాండ్ ఆవరణలో నంద్యాల ఆత్మకూరు ప్రధాన రహదారిపై జర్నలిస్ట్ సంఘాలు ప్రజాసంఘాలు అయినా ఎస్డిపిఐ పార్టీ శ్రీశైలం నియోజకవర్గం అధ్యక్షుడు ఆరిఫ్యూషన్ సిపిఎం మండల కార్యదర్శి రత్నమయ్య సిపిఎం పార్టీ సీనియర్ నాయకులు టి.రామచంద్రుడు, రాజు వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు డేవిడ్ ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి పూల వెంకట సుబ్బన్న మాదిగ జర్నలిస్టులతో కలిసి రాస్తారోకో ధర్నా చేపట్టడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పత్రిక విలేకరుల పైన దాడులు చేయడం సిగ్గుమాలిన విషయమని మండిపడ్డారు. ఏదైనా తప్పుడు కథనాలు ప్రచురిస్తే ఆ పత్రిక యాజమాన్యంపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలే తప్ప వ్యక్తిగతంగా భౌతిక దాడులకు దిగడం ఏంటి అని






ప్రశ్నించారు. ఇలాంటి ఘటనలు తరచూ ఏదో ఒకచోట జరుగుతూనే ఉన్నాయని ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ప్రజలు, ప్రజాసంఘవాదులు మేధావులు, జర్నలిస్టులకు న్యాయం జరిగేంత వరకు చట్టపరమైన పోరాటం చేస్తామని హెచ్చరించారు. రాస్తారోకో అనంతరం ర్యాలీగా వెళ్లి నినాదాలు చేస్తూ దాటిపాల్పడిన వ్యక్తిని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే బాధితుడు ఆంజనేయుల మీద బనాయించిన తప్పుడు కేసు(కౌంటర్ కేసు) వెంటనే ఎత్తి వేసి జర్నలిస్టుల అందరికీ రక్షణ కల్పించాలని కోరారు. ఇలాంటి సంస్కృతికి సృష్టి పలికేలా ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి టిడిపి నాయకులను హెచ్చరించాలని వారు విజ్ఞప్తి చేశారు. అనంతరం స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. తహశీల్దార్ పద్మావతికి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా తహసిల్దార్ పద్మావతి మాట్లాడుతూ దాడి సంఘటన విషయాన్ని జిల్లా ఉన్నతాధికారులకు తెలియజేస్తానని తెలిపారు. బాధితులకు న్యాయం జరిగేలా కృషి చేస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల జర్నలిస్టులు ఆంధ్రజ్యోతి విలేఖరి కొండయ్య, ఆంధ్రప్రభ విలేకరి షౌకత్ ఆలీ, ప్రజా రిపబ్లిక్ విలేకరి నాగరాజు, సాక్షి విలేఖరి దస్తగిరి, సూర్య విలేకరి చంద్రబాబు, మీ 24 న్యూస్ విలేకరి రామరాజు, సిటీ కేబుల్ రిపోర్టర్ మా భాష, ప్రజా సంఘాల నాయకులు వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షులు కుల్లాయి స్వామి, కార్యదర్శి సుబ్బరాయుడు, ప్రజాసంఘాల నాయకులు ప్రజలు పాల్గొన్నారు.

# కూటమి ప్రభుత్వ దోపిడీపై ఎమ్మెల్సీ ఇసాక్ బాషా ఆగ్రహం

**నంద్యాల బ్యూరో ఫిబ్రవరి 9 (రిపబ్లిక్ న్యూస్)**

గుంటూరు జిల్లా మంగళగిరి నియోజకవర్గం చిన్న కాకాని గ్రామంలో ఇండస్ట్రియల్ పార్క్ పేరుతో అంజుమన్ ఎ ఇస్లామియా సంస్థకు చెందిన 71 ఎకరాల 57 సెంట్ల భూమిని స్వాధీనం చేసుకోవడాన్ని ఎమ్మెల్సీ ఇసాక్ బాషా తీవ్రంగా ఖండించి, సోమవారం నంద్యాల్లో జరిగిన స్పందన కార్యక్రమంలో అధికారులకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఇసాక్ బాషా మాట్లాడుతూగుంటూరు జిల్లా మంగళగిరి నియోజకవర్గంలోని చిన్న కాకాని గ్రామంలో ఇండస్ట్రియల్ పార్క్ పేరుతో గుంటూరు అంజుమన్ ఎ ఇస్లామియా సంస్థకు చెందిన 71 ఎకరాల 57 సెంట్ల భూమిని స్వాధీనం చేసుకోవడం పూర్తిగా అన్యాయమని తీవ్రంగా ఖండించారు. ఈ తరహా చర్యలు కొనసాగితే రాబోయే రోజుల్లోవక్ఫ్ భూములు, క్రిస్టియన్ మైనారిటీలకు చెందిన స్థలాలు, ఇతర మతాలకు సంబంధించిన ఆస్తులు కూడా దోపిడీకి గురయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు. జగనన్న ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ అన్యాయ స్వాధీనాలను పూర్తిగా వెనక్కి తీసుకుంటామని ఎమ్మెల్సీ ఇసాక్ బాషా ధీమాగా ప్రకటించారు. ప్రజల విశ్వాసాన్ని మోసం చేస్తూ,




అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్న కూటమి ప్రభుత్వానికి ప్రజలే తగిన సమయంలో తగిన గుణపాఠం చెబుతారని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నంద్యాల్ మున్సిపల్ చైర్పర్సన్ మబున్నిసా, వైయెస్సార్సీపీ నంద్యాల్ జిల్లా ఉపాధ్యక్షులు దాల్మిల్ అమీర్, జిల్లా వైఎస్సార్సీపీ మేధావుల సంఘం అధ్యక్షులు రసూల్ ఆజాద్, వైయెస్సార్సీపీ నాయకులు గన్నీ కరీం, వైయెస్సార్సీపీ కౌన్సిలర్లు ఆరిఫ్, కలాం, బాసిద్, వైయెస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# సైబర్ ముప్పులపై విద్య కల్పించడమే లక్ష్యం

### సురక్షిత ఇంటర్నెట్ దినోత్సవం పోస్టర్లను ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్

**అనంతపురం కలెక్టరేట్, ఫిబ్రవరి 09,(రిపబ్లిక్ న్యూస్):**

సైబర్ ముప్పులపై విద్య కల్పించడమే లక్ష్యమని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ పేర్కొన్నారు. కృత్రిమ మేధస్సుతో సైబర్ మోసాల నివారణ లక్ష్యంగా సురక్షిత ఇంటర్నెట్ దినోత్సవం నిర్వహించనున్నారు. సోమవారం సాయంత్రం అనంతపురం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో నేడు జరుపుకునే సురక్షిత ఇంటర్నెట్ దినోత్సవం 2026 పోస్టర్లను జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్, డిఆర్ఓ ఏ.మలోల, ఎన్ఐసీ ఏడీఐఓ టి.భారతి, తదితరులు పాల్గొన్నారు.

**ఏఐను ఉపయోగించాలనే అంశంపై అవగాహన**

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈ సంవత్సరం సురక్షిత ఇంటర్నెట్ దినోత్సవం థీమ్ “స్మార్ట్ టెక్నాలజీ, సురక్షిత ఎంపికలు కృత్రిమ మేధస్సు (ఏఐ) ను సురక్షితంగా, బాధ్యతాయుతంగా వినియోగించడం”గా నిర్ణయించబడిందని తెలిపారు. సురక్షిత ఇంటర్నెట్ దినోత్సవం ప్రతి సంవత్సరం ఫిబ్రవరి నెలలో రెండవ మంగళవారం ప్రపంచవ్యాప్తంగా జరుపుకుంటారన్నారు. ఇంటర్నెట్, ఏఐను సురక్షితంగా, బాధ్యతాయుతంగా ఉపయోగించాలనే అంశంపై ప్రజల్లో అవగాహన కల్పించడం, సైబర్ హైజీన్‌కు సంబంధించిన ఉత్తమ పద్ధతులను ప్రోత్సహించడం, సైబర్ ముప్పులు, వాటి నివారణ చర్యలపై విద్య కల్పించడమే ఈ కార్యక్రమ




ప్రధాన లక్ష్యంగా ఉందన్నారు. ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో, ఐ ఎస్ ఈ ఏ ప్రాజెక్ట్ కింద, ఎన్ఐసీ, ఇతర సంస్థల సహకారంతో నేడు దేశవ్యాప్తంగా ఈ అవగాహన కార్యక్రమం నిర్వహించబడుతోందన్నారు.

**నేరాలపై అప్రమత్తంగా ఉండాలి**

ఈ సందర్భంగా యువ పిల్లలు, విద్యార్థులు, మహిళలు, వృద్ధులు ఏ ఐ డీప్‌ఫేక్‌లు, ఏ ఐ వాయిస్ మోసాలు వంటి సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని, సురక్షితంగా ఇంటర్నెట్, ఏ ఐ ను వినియోగించాలని ఎన్ఐసీ ఏడీఐఓ టి.భారతి సూచించారు. ఈ కార్యక్రమంలో ఈ–డిస్ట్రిక్ట్ మేనేజర్ రమణ రెడ్డి, ఈ–ఆఫీస్ అసోసియేట్ అనిల్ యాదవ్ పాల్గొన్నారు.

# ప్రజలకు సేవ చేయడమే మా లక్ష్యం

## ఒకసారి అవకాశం ఇవ్వండి కాలనీని అభివృద్ధి చేసి చూపిస్తా

### 14వ వార్డు బి ఆర్ ఎస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థి పల్లె నాగజ్యోతి వెంకటరమణ

**ఆందోల్‌ప్రతినిధి ఫిబ్రవరి 9( రిపబ్లిక్ న్యూస్)**

అందోల్ జోగిపేట మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా 14వ వార్డు బిఆర్ఎస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి పల్లె నాగజ్యోతి వెంకటరమణ ఇంటింటి ప్రచారంలో భాగంగా నాగజ్యోతి మాట్లాడుతూ కాలనీ అన్ని రకాలుగా వెనుక పడ్డది ఎంతోమంది కౌన్సిలర్లు వచ్చారు పోయారు కాలనీ అభివృద్ధిలో పూర్తి నిర్లక్ష్యం వహించి ప్రజలను పట్టించుకున్న పాపాన పోలేదు అందుకే మీ ముందుకు వచ్చిన నన్ను ఆశీర్వదించి మన పరిధిలో కాలనీ అన్ని రంగాల్లో అభివృద్ధి పరచుకునే అవకాశం మన కలగాలి అంటే 11 నాడు జరిగే పోలింగ్ రోజు అందరూ మీ అమూల్యమైన ఓటును కారు గుర్తుపై వేసి నన్ను భారీ మెజారిటీతో గెలిపిస్తారని ఆమె ప్రజలను ఆశీర్వదించారు ఈ సందర్భంగా వెంకటరమణ మాట్లాడుతూ కాలనీలో డ్రైనేజీ సమస్య సిసి రోడ్లు వీధి దీపాలు ఇప్పటికీ ఇందిరమ్మ ఇల్లు కూడా ఈయలేని పరిస్థితి ఇప్పటికీ కాగితాలు పిల్ల మీద కప్పుకొని ఉండాల్సిన పరిస్థితి కాలనీలో దాపరించింది చదువుకొని ఉపాధి లేక ఎంతో మంది యువత ఖాళీగా ఉన్న పరిస్థితి మన కాలనీలో కనబడుతుంది వీటన్నిటి సమస్య పరిష్కారం ఒకటే మార్గం మన కాలనీ ని అభివృద్ధి పరచుకొని యువతకు ఉపాధి



అవకాశం కల్పించాలని మీ ముందుకు వచ్చిన మమ్మల్ని ఆశీర్వదించి మీ అమూల్యమైన ఓటు కారు గుర్తుపై వేసి భారీ మెజారిటీతో మా సతీమణి గెలిపిస్తారని ఓటర్ మహాశయులను వేడుకున్నారు ఈ సందర్భంగా వార్డుకు ఇన్చార్జిగా వచ్చినటువంటి టిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు డాకూర్ మాజీ సర్పంచ్ శంకరయ్య మాట్లాడుతూ బిఆర్ఎస్ పార్టీ మాజీ శాసనసభ్యులు చంటి క్రాంతి కిరణ్ గారి ఆశీస్సులతో 14వ వార్డు బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి పల్లె నాగజ్యోతి వెంకటరమణ నియమించినందుకు వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తూ గత ఆరు రోజుల నుంచి 14 వార్డులో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న మేము ఈ 14వ వార్డు ప్రజలు గత రెండున్నర సంవత్సరాల కాలంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండి ఇలాంటి ప్రజలకు ఉపయోగపడని వన్ ఇచ్చినటువంటి హామీలతో విసుకు చెంది కాంగ్రెస్ పార్టీపై వ్యతిరేకతతో మాపై మా అభ్యర్థిపై అశేష స్పందన కనబరుస్తూ భారీ మెజార్టీతో గెలిపిస్తామని కూడా ప్రజలు మాటఇవ్వడం జరుగుతుంది ఎందుకంటే గత కెసిఆర్ ప్రభుత్వంలో అనేక సంక్షేమ పథకాలు నేరుగా ఇంటికే వచ్చే విధంగా ఆయన చేసిన కృషి మరువలేనిదని ఇప్పటివరకు వర్క్ ఇచ్చిన హామీలు ఒకటి కూడా అమలు చేయకుండా అడ్డగోలు హామీలతో అధికారంలోకి వచ్చిఈరోజు ఈరోజు మళ్లీ ఓట్లు అడగడానికి ఎలా వస్తారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు కావున రెండు రోజుల నుంచి ఈ నియోజకవర్గానికి ఎమ్మెల్యేగా ఉన్న రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వహిస్తూ మున్సిపల్ ఎన్నికల ప్రచారం నిర్వహిస్తూ ఆయన ప్రచారం చేస్తున్న సందర్భంలో పోలీసుల సహకారంతో మీడియాను అనగదొక్కే ప్రయత్నం చేస్తూ ఎక్కడ మహిళలు యువత ప్రశ్నిస్తారు అనే ఒక ఆందోళనతో వీడియోలు తీయకూడదు ఫోటోలు తీయకూడదని షరతులు పెట్టి ప్రజా సమస్యలపై స్పందించే మీడియాను కూడా ఆయన చిన్నచూపు చూసి వారు ఎలాంటి వీడియోలు తీయకూడదు అని అనుమతి ఇవ్వడం లేదు అంటే దీన్నిబట్టి అర్థమవుతుంది ఏందంటే జరుగుతున్న మున్సిపల్ ఎన్నికల్లో నగర పంచాయతీలో టిఆర్ఎస్ జండాలు ఎగరవేస్తామని మాకు ధీమా వ్యక్తం అవుతుంది ఈ కార్యక్రమంలో కాలనీవాసులు బి ఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు

# మున్సిపల్ ఎన్నికల పక్రియ సాఫీగా జరగాలి

### -జిల్లా ఎన్నికల అధికారి , కలెక్టర్ రాహుల్ రాజ్

**మెదక్ జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 9( రిపబ్లిక్ న్యూస్)**



మున్సిపల్ ఎన్నికల ప‌క్రియ సాఫీగా జరగాలని జిల్లా ఎన్నికల అధికారి,కలెక్టర్ రాహుల్ రాజ్ ఎన్నికల అధికారులకు స్పష్టం చేశారు. సోమవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి జిల్లా ఎన్నికల అధికారులతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ.. జిల్లాలో జరుగనున్న నాలుగు మున్సిపాలిటీ ఎన్నికలు సాఫీగా జరగాలనన్నారు.ఏవైనా ఎన్నికల నిర్వహణ పనులు పూర్తి కాకపోతే ఈ రోజు పూర్తి చేసి,రేపు ఉదయం 9 గంటల వరకు ఎన్నికల సిబ్బంది డిస్ట్రిబ్యూషన్ కేంద్రాశీలో రిపోర్ట్ చేయాలన్నారు.ఎన్నికల సిబ్బందికి డిస్ట్రిబ్యూషన్ సెంటర్ లో తగినన్ని కౌంటర్లు ఏర్పాటు చేసి మార్గనిర్దేశనం చేయాలన్నారు.ఆర్వోలు, జోనల్ అధికారులు ఎన్నికల వస్తూ సామాగ్రిని పరిశీలించుకొని,పోలీస్ సంబంధిత ఎస్కార్ట్ వాహనం తో పోలింగ్ కేంద్రాలకు బయలుదేరాలన్నారు.పోలింగ్ కేంద్రాలకు వెళ్లిన పోలింగ్ సిబ్బందికి అన్ని సౌకర్యాలు కల్పించాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు.పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల సంఘం నియమాలను అనుసరించి పత్రాలను నింపాలని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో అదనపు ఎన్నికల అధికారి, అదనపు కలెక్టర్ నగేష్, మున్సిపల్ కమిషనర్లు, జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి,ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

# జోగిపేట గడ్డమీద గులాబీ జెండా ఎగిరేస్తాం.

### బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు చాపల వెంకటేశం శ్రీధర్

**ఆందో నియోజకవర్గం ప్రతినిధి ఫిబ్రవరి 9( రిపబ్లిక్ న్యూస్)**



అందోల్ జోగిపేట మున్సిపల్ పరిధిలో ఈసారి 17 వార్డులో గులాబీ జెండా ఎగరేస్తామని బి ఆర్ఎస్ సీనియర్ నాయకులు చాపల వెంకటేశం శ్రీధర్ దిమా వ్యక్తం చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా జోగిపేట 17 వార్డు అభ్యర్థి కడావత్ గణేష్ కు మద్దతుగా ఇంటింటి ప్రచారం చేశారు స్థానికంగా ఉంటూ ప్రజల సమస్యల మీద అవగాహన ఉన్న వ్యక్తి యువ నాయకుడుఅని వారు అన్నారు. బిఆర్ఎస్ కౌన్సిలర్ అభ్యర్థి కడవత్ గణేష్ కారు గుర్తుపై ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు నాయకులు యువకులు మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

# సొంత హామీలతో మీ ముందుకు వస్తున్న.

### 4వవార్డు బిఆర్ఎస్ అభ్యర్థి మల్కల మాధవి బలరాం.






**అందోల్ ఫిబ్రవరి 9 (రిపబ్లిక్ న్యూస్)**అందోల్ జోగిపేట మున్సిపాలిటీ పరిధిలో ఉన్న 4వ వార్డ్ అభ్యర్థి మల్కల మాధవి బలరాం తన సొంత నిధులతో హామీ మెనీ పేస్టు విడుదల చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ

1. నిరంతర సమస్యలు మంచినీరు, వీధి దీపాలు ,డ్రైనేజీ వ్యవస్థ ,పరిష్కారం చేస్తాను.
2. మన వార్డు లో ప్రతి ఇంటి ఆడబిడ్డ వివాహానికి 10,000వేల ఆర్థిక సాయం అందిస్తాను.
3. మన వార్డులో ఆడబిడ్డ పుట్టిన వెంటనే 5000 రూపాయలు ఆర్థిక సాయం అందిస్తాను.
4. మన వార్డులో అనివార్య కారణాలవల్ల మరణించిన కుటుంబానికి 5000 రూపాయలు తక్షణ సాయం కింద అందిస్తాను.
5. మన వార్డులో 1వ తరగతి నుండి 5వ తరగతి వరకు విద్యార్థులందరికీ నోటుబుక్స్ పంపిణీ చేస్తాను.
6. మన వార్డులో ప్రతి ఆరు నెలలకు ఒకసారి నా సొంత ఖర్చులతో హెల్త్ క్యాంపును ఏర్పాటు చేస్తాను.

ఇవే కాకుండా ప్రభుత్వం నుంచి వచ్చే సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికి చేరే విధంగా కృషి చేస్తానని అన్నారు. 10 సంవత్సరాల కాలంలో గెలిచే వరకు నేనున్నానని అనేవారు కానీ గెలిచిన తర్వాత పట్టించుకోని నాయకులకు మీ ఓటుతో ఈసారి బుద్ధి చెప్పి మీ అమూల్యమైన ఓటును మా సతీమణి మల్కల మాధవి కారు గుర్తుపై ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ సీనియర్ నాయకులు, మహిళలు, కార్యకర్తలు, యువతి యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# నర్సాపూర్ మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో జోర్ అందుకున్న నాలుగో వార్డ్ బి ఆర్ ఎస్ అభ్యర్థి దుర్గాప్ప గారి శ్రావ్య మహేందర్ గౌడ్






**మెదక్ జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 9( రిపబ్లిక్ న్యూస్)**

మెదక్ జిల్లా నర్సాపూర్ మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా బి ఆర్ఎస్ పార్టీ 4వ వార్డ్ అభ్యర్థిగా బలపరిచిన శ్రావ్య ను నియమించినందుకు కృతజ్ఞతలు తెలియజేస్తూ ఈ సందర్భంగా4వార్డ్ బి ఆర్ ఎస్ అభ్యర్థి దుర్గాప్ప గారి శ్రావ్య మహేందర్ గౌడ్ మాట్లాడుతూ గత పదేళ్ల కాలంలో కెసిఆర్ ప్రభుత్వంలో అనేక సంక్షేమ పథకాలు నేరుగా ఇంటింటికి వచ్చే విధంగా ఎలాంటి దళారులు లేకుండా అనేక సంక్షేమ పథకాలు అమలు పరచడంలో ప్రపంచంలోనే ఒక దిశ నిర్దేశంగా నిలిచిన వ్యక్తి కెసిఆర్ అదే బాటలో ఇప్పుడు జరుగుతున్నటువంటి మున్సిపాలిటీ ఎలక్షన్ రెండున్నర సంవత్సరాలు కావస్తున్న అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆరుగ్యారింటిలను పక్కనపెట్టి అడ్డగోలు ఆమీలతో అధికారం లోకి కొచ్చిన ప్రభుత్వం ఎలాంటి సంక్షేమ పథకాలు అమలు చేయకుండా తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్న తన ప్రాణాలు సైతం లెక్కచేయకుండా రైతుకు పెట్టుబడి సాయం కింద రైతు బంధు పథకం తెచ్చాడు ఎవరైనా రైతు మరణిస్తే తక్షణమే ఐదు లక్షల బీమా ను రైతు బీమా గా మార్చాడు ఆడబిడ్డ కాన్పు అయితే 20 రకాల వస్తువులతో కేసీఆర్ కిట్టును అందించాడు ఎవరైనా ప్రభుత్వ ఆసుపత్రికి పోవాలి అంటే భయపడే పరిస్థితిలో ప్రైవేటు ఆసుపత్రులకు దీటుగా ప్రభుత్వ ఆసుపత్రులు తీర్చిదిద్దిన ఘనత కెసిఆర్ కే దక్కుతుంది ఆడబిడ్డ పెళ్లికి కళ్యాణ లక్ష్మి ఒక్క లక్ష 16 ఒక అన్నగా నిలిచాడు అదే కాకుండా షాది ముబారక్ కుల వృత్తుల పరంగా మత్స్యకారులకు చేపల పెంపకం చేనేతలకు మగ్గం పనులు గ్రామపంచాయతీలో ఒక మంచి ఆలోచనతోని చెత్త వేయడానికి ఒక ట్రాక్టర్ మంచి చెడు కార్యక్రమానికి ట్యాంకర్ ఇలా చెప్పుకుంటూ పోతే ఆయన అనేక కార్యక్రమాలు చేసి ప్రజల గుండెల్లో నాటుక పోయిన నాయకుడిగా ఉన్నారు కాబట్టి నర్సాపూర్ నగర పాలక ఎన్నికల్లో నాలుగో వార్డ్ బిఆర్ఎస్ పార్టీ బలపరిచిన అభ్యర్థిగా దుర్గాప్ప గారి శ్రావ్య మహేందర్ గౌడ్ మీ అందరి ఆశీర్వాదంతో నాపై నమ్మకంతో కారు గుర్తుకు ఓటు వేసి నన్ను భారీ మెజారిటీతో గెలిపిస్తారని మీ యొక్క దృఢ నమ్మకంతో వేడుకుంటున్నాను

# ఆల్మయి పేట్ గ్రామం లో పాఠశాల ఉపధ్యాయుల నిర్లక్ష్యం వల్ల

# ఇద్దరు విద్యార్థినిల తోపులాటలో పాపకు గాయాలు

**ఆందోల్ ప్రతినిధి ఫిబ్రవరి 9( రిపబ్లిక్ న్యూస్)**

ఆందోల్ మండలం అల్మాయిపేట గ్రామంలో గల ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయుల నిర్లక్ష్యం వల్ల నిరంతరం ఏదో ఒక సంఘటన చోటు చేసుకుంటా ఉన్నది గతంలో ఒక బాబు బిల్డింగ్ పైనుంచి కింద పడడం జరిగింది ఇప్పుడు క్లాస్ రూమ్ లో బోర్డు తుడుపే సందర్భంలో ఇద్దరు తోపుకోవడంతో ఒక పాపకు గట్టిగా గాయాలయ్యాయి రెండు కుట్లు పడ్డాయి ఉపాధ్యాయులు ఉన్నారా లేరా అని తల్లిదండ్రులకు అంతుచిక్కడం లేదు ఎందుకంటే పొద్దున పిల్లల్ని స్కూల్ కి పంపించి ఏదో పొలం పనులకు వెళు తుంటారు సమయానికి రావచ్చు రాకపోవచ్చు సమస్య చిన్నదైతే పరవాలేదు ఒకవేళ పెద్ద సమస్య ఉంటే ఆ పరిస్థితి




ఎవరు బాధ్యత వహించాల్సి వస్తది అని తల్లిదండ్రుల యొక్క ఆవేదన పూర్తిగా ఉపాధ్యాయులు ఉన్నారా అంటే ఉన్నారు అన్న చందంగా పాఠశాల నడుపుతున్నారు పాఠశాలలో ఒక నాలుగు సీసీ కెమెరాలు ఉన్నప్పటికీ సీసీ కెమెరాలు పేరుకు మాత్రమేనామ మాత్రముగా ఉన్నాయని ఉపాధ్యాయులు చెప్తున్నారు మరి సీసీ కెమెరాలు ఎందుకు పెట్టినట్టు అర్థం



కావడం లేదు దీనిపై వెంటనే అధికారులు చర్యలు తీసుకొని విధుల్లో ఉన్న ఉపాధ్యాయులపై కఠిన చర్యలు తీసుకొని పాఠశాల విద్యార్థులకు రక్షణ కల్పించాలని గ్రామ తల్లిదండ్రుల విజ్ఞప్తి



# కొన్యాల గ్రామపంచాయతీ ముందు విద్యార్థుల తల్లిదండ్రుల నిరసన

**హత్నూర:09 ఫిబ్రవరి 26( రిపబ్లిక్ న్యూస్)**

కొన్యాల గ్రామంలో ప్రైమరీ స్కూల్ మరియు జడ్పీ హైస్కూల్ ప్రధాన గేటు ఎదురుగా శ్రీ బాలాజీ కిరాణం జనరల్ స్టోర్స్ ఉండడంతో విద్యార్థులకు ప్రమాదం ఎదురయ్యే అవకాశాలు ఉందని ఆందోళన వ్యక్తం చేస్తూ విద్యార్థుల తల్లిదండ్రులు గ్రామపంచాయతీ కార్యాలయం ముందు నిరసన చేపట్టారు పాఠశాల ముందు జోగిపేట్ మరియు సంగారెడ్డి ప్రధాన రహదారి భారీ వాహనాల రాకపోకలు ఎక్కువగా ఉంటాయని అదే సమయంలో పిల్లలు కిరాణా దుకాణం కు వెళ్లడం ప్రమాదకరమని తల్లితండ్రులు తెలిపారు ఈ విషయమై గ్రామ సర్పంచ్ కార్యదర్శి కి విన్నవించిన స్పందన లేకపోవడంతో నిరసనకు దిగినట్టు తెలిపారు ఇప్పటికైనా సర్పంచ్ మరియు కార్యదర్శి స్పందించి వెంటనే స్కూలుకు ఎదురుగా ఉన్న కిరణా షాప్ తొలగించకపోతే పరిణామాలు చాలా ఉద్రితనను తలెత్తుతాయని హెచ్చరిస్తున్నాము విద్యార్థుల నుండి ఎలాంటి ప్రమాదాలు జరగకముందే ముందు జాగ్రత్తగా ఆ కిరణ్ షాప్ ను తొలగించాలని కోరుచున్నాము జనాల కొరకు ఎన్నుకోబడ్డ మీరు జనాల మాట లెక్క చేస్తలేరు కాబట్టి జనాలు జనాలు తిరగబడే రోజులు దగ్గరలోనే ఉన్నాయని హెచ్చరిస్తున్నాము ఈ సందర్భంగా సర్పంచ్ మరియు కార్యదర్శి కి ముఖ్యంగా మీకు ఇద్దరికీ తెలియజేయడమేమనగా మీరు గనుక పెద్ద మనసు చేసుకొని ఆ కిరణ షాపును తొలగించకపోతే పరిణామాలు మారిపోతాయి చాలా ఇబ్బందిలో పడతారు అంట అని తెలియజేస్తున్నాము ఈ సందర్భంగా కార్యదర్శి కి మరియు ఎంపీడీవో కు కూడా తెలియజేయునది ఏమనగా ప్రభుత్వం మాది ఉంది కదా అని విరవిగుతున్నారేమో కానీ ఎప్పటికి ఇదే ప్రభుత్వం ఉండదని గుర్తు చేసుకోండి కానీ ఏ ప్రభుత్వం ఉన్నా జాబు మాత్రం మీరే చేయవలసి వస్తది అప్పుడు అతి జాగ్రత్తగా ఉండవలసి వస్తది అది గుర్తుపెట్టుకొని వెంటనే యాక్షన్ తీసుకొని ఆ షాప్ లో తొలగించాలని కోరుచున్నాము జనాలు తిరగబడక ముందే ముందు జాగ్రత్తగా తీసుకుంటే బాగుంటదని ఆలోచన చేస్తే బాగుంటదని విద్యార్థి విద్యార్థుల తల్లిదండ్రులము కోరుచున్నాము లేనిపక్షంలో ఎంపీడీవో ఆఫీస్ ముందు కూడా ధర్నా చేయడానికి కూడా వెనకాడ బోమని హెచ్చరిస్తున్నాము షాపును తొలగించమని ఎంపీడీవో సార్ గారిని అడిగితే మాకు పైన నుంచి ప్రెషర్ ఉందండి అని చెప్తున్నారు ఎవరు చేస్తున్నారు సార్ మీకు ప్రెషర్ ఎమ్మెల్యేల




ఇన్చార్జిలా వాళ్ల కోసం పని చేస్తారా జనాల కోసం పని చేస్తారా మీరు? మీ పదవులు కాపాడుకోవాలి అనుకుంటున్నారా లేదా ఇంట్లో కూర్చొని ఈగలు జరుపుకోవాలని అనుకుంటున్నారా ఎంపీడీవో సార్ జనాలు వచ్చి గిది పరిస్థితి అని వినతి పత్రం అందజేస్తే తీసుకునే పద్ధతి కూడా తెలియకుండా సీట్లోనే కూర్చొని వినతిపత్రం తీసుకుంటారా? ఎలాంటి సమాధానం ఇవ్వకుండా మీ ఇష్టం ఉన్నట్టు ప్రవర్తిస్తారా అంటే ప్రభుత్వం ఈ వైపు ఉందని అనుకుంటున్నారా పింక్ బుక్ లో మీ పేరు రాసి పెడుతున్నాము ఎంపీడీవో సార్ కార్యదర్శి మీకు ఇద్దరికీ మరియు మరీ చెబుతున్నాము మీరిద్దరు అనుకోని మాట్లాడుకుని షాప్ లో తొలగించకపోతే పరిణామములు చాలా తీవ్రంగా ఉంటాయని ఖండిస్తున్నాము లేని పక్షంలో కలెక్టర్ గారిని కలిసి మీ జాబులకు ఇబ్బంది కలిగి లాగున చూస్తామని కూడా హెచ్చరిస్తున్నాము ఓన్లీ సర్పంచ్ ఐదేళ్లు మాత్రమే పదవిలో ఉంటారు కానీ కార్యదర్శి ఎంపీడీవో మీరు మాత్రం 60 ఏళ్ల దాకా పదవిలో ఉంటారు ఓన్లీ సర్పంచ్ కి మాత్రమే భయపడుకుంటూ బ్రతికితే మీరు ఎక్కడ పని చేయలేరు సర్పంచ్ చెప్పినటువంటి మీరు ఎక్కడ కూడా పనిచేయలేరు జనాల కోసం పనిచేయడం కోసం మీకు జాబులున్నాయి జనాల కోసం పనిచేయండి లేదంటే రాజీనామా చేసి ఇంట్లో కూర్చోండి అంతేగాని సర్పంచ్ చెప్పిండని మాకు పైనుంచి ఆర్డర్స్ ఉన్నాయని పైనుంచి ప్రెజర్స్ ఉన్నాయని అని ఎత్తిపోకూడదు పోతే ఊరుకో భూమి మేమే కూర్చుని పెట్టి గంజి పోసే టైం వస్తది అని కూడా తెలియజేస్తున్నాము కొన్యాల కార్యదర్శి కి చెప్పేదేమనగా ఉంటావా సరిగా పనిచేయు ఊర్లో ఉండి లేదంటే రాజీనామయ్యాయు అట్ల కూడా కాదు అనుకుంటే ట్రాన్స్ఫర్ పెట్టుకో ఊర్లకే వెళ్ళిపో మాకు అవసరం లేదు సర్పంచ్కు భయపడటం వి నీకెందుకు అలాంటోని జాబ్ చేయడం ఎందుకు ఇంట్లో కూర్చోవడం మంచిది కదా లేదంటే కిరాణా షాప్ అతను మీకేమైనా డబ్బులు కూడా ఇచ్చాడా నా డబ్బా తీసేయకండి అని డబ్బులు ఇస్తే లంచాలు తీసుకుంటే ఆయన ఇంటి దగ్గర పోయి పని చేయండి ఆయన దగ్గర పోయి పని చేయండి కానీ జనాలకు మాత్రం జవాబుదారీగా నిలబడండి ఓరిని ఆగమాగం చేయకుండా అభివృద్ధి చేయమని రేపు గాని ఆ కిరణ షాపు తొలగించిన యెడల పరిస్థితులు చాలా తీవ్రంగా ఉంటాయని మరొకసారి సర్పంచ్ కార్యదర్శి తెలియజేస్తున్నాము లేని పక్షంలో మీ ఇద్దరి కోసం కలెక్టర్ కలిసి మీ మీద సస్పెన్షన్ వేటు వేసే వరకు ఊరుకోబోమని కూడా హెచ్చరిస్తున్నాము.

# తృప్తి కాంటీన్‌లో కలెక్టర్ భోజనం

## ఆహార నాణ్యతపై సంతృప్తి

**ప్రజలు, అధికారులతో కలిసి తృప్తి కాంటీన్లో భోజనం చేసిన కలెక్టర్, జాయింట్ కలెక్టర్**



**నంద్యాల, బ్యూరోఫిబ్రవరి 09 (రిపబ్లిక్ న్యూస్)**
రాష్ట్ర సచివాలయం నుండి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారి అధ్యక్షతన మంత్రులు, కార్యదర్శులతో నిర్వహించిన సమావేశం అనంతరం భోజన విరామ సమయంలో జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి, జాయింట్ కలెక్టర్ కొల్లా బత్తుల కార్తీక్ లు జిల్లా అధికారులు, ప్రజలతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. సోమవారం కలెక్టరేట్ ఆవరణలో మెప్మా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తృప్తి కాంటీన్లో భోజనం చేసిన కలెక్టర్, జాయింట్ కలెక్టర్ లు అక్కడ అందిస్తున్న ఆహార పదార్థాల నాణ్యత, పరిశుభ్రత, వంట విధానం, ధరలు తదితర అంశాలపై సిబ్బందిని అడిగివివరాలుతెలుసుకున్నారు.సామాన్య ప్రజలకు తక్కువ ధరకు పరిశుభ్రమైన, పోషకాహారంతో కూడిన భోజనం అందించాలనే లక్ష్యంతో తృప్తి కాంటీన్లను మరింత సమర్థవంతంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. ప్రజలకు నేరుగా ఉపయోగపడే ఈ తరహా సంక్షేమ కార్యక్రమాల అమలులో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని మెప్మా పీడీకి కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్, జాయింట్ కలెక్టర్ లతో పాటు పలువురు జిల్లా అధికారులు మధ్యాహ్న భోజనంలో పాల్గొన్నారు.

# ప్రజా అర్జీలను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలి

**పిజిఆర్ఎస్ కు 278 దరఖాస్తులు**

**జిల్లా రెవెన్యూ అధికారి డి.రామునాయక్**





**నంద్యాల, బ్యూరో ఫిబ్రవరి, 09 (రిపబ్లిక్ న్యూస్):**
ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా స్వీకరించిన దరఖాస్తులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని జిల్లా రెవెన్యూ అధికారి డి.రామునాయక్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ హాలులో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఉమా మహేశ్వరి, సంబంధిత శాఖ అధికారులు పాల్గొని ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు.ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి రామునాయక్ మాట్లాడుతూ....ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా ప్రజల నుండి స్వీకరించిన దరఖాస్తులను నిర్ణీత గడువులోగా బియాండ్ ఎస్ఎల్ఏ వెళ్లకుండా పరిష్కరించాలన్నారు. అర్జీదారుడు ఇచ్చిన ప్రతి ఒక్క అర్జీని క్షుణ్ణంగా చదివి సంబంధిత శాఖఅధికారులుకు కేటాయించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సమస్యలను అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, పరిష్కరించిన అర్జీల పట్ల అర్జీదారుడి సంతృప్తి స్థాయిని కూడా తెలుసుకోవడం జరుగుతోందన్నారు. అదే విధంగా రీఓపెన్ అర్జీలపై ప్రత్యేక దృష్టి సారించి వాటిని క్షేత్ర స్థాయిలో పరిశీలించి పరిష్కరించడం జరుగుతోందన్నారు.

**పిజిఆర్ఎస్ ద్వారా స్వీకరించిన కొన్ని సమస్యలు**

ఆళ్లగడ్డ మండలం, పి.చింతకుంట గ్రామానికి చెందిన బి.సాలమ్మ తన భర్త చనిపోయాడని ఆర్థిక చేయూత కోసం తనకు వితంతు పెన్షన్ మంజూరు చేయాలని కోరుతూ డిఆర్ఓకు అర్జీ సమర్పించారు.బేతంచెర్ల మండలానికి చెందిన వై.లక్ష్మి తనకు బేతంచెర్ల నగర పంచాయతీలోని టిడ్కో గృహాల్లో జి-52 ప్లాట్ ను కేటాయించడం జరిగిందని, కానీ సదరు ప్లాట్ ఎక్కడ ఉందో ఇంత వరకూ చూపలేదని అందుకు తగిన చర్యలు తీసుకోవాలని డిఆర్ఓకు దరఖాస్తు అందజేశారు.బండి ఆత్మకూరు మండలం, ఈర్నపాడు గ్రామానికి చెందిన సి. రాఘవేంద్ర రెడ్డి తనకు ఇంతవరకు మినీ గోకులంకు సంబంధించిన నగదు జమ కాలేదని అందుకు తగిన చర్యలు తీసుకోవాలని డిఆర్ఓకు అర్జీ సమర్పించారు.ఇంకా ఈ కార్యక్రమంలో 278 మంది అర్జీదారులు తమ సమస్యల పరిష్కారానికి జిల్లా రెవెన్యూ అధికారికి అర్జీలు సమర్పించారు. ఈ సమస్యలన్నీ నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఎండార్స్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు.వెట్టి చాకిరి రహిత జిల్లాగా తీర్చిదిద్దాలి.వెట్టి చాకిరి రహిత జిల్లాగాతీర్చిదిద్దడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా రెవెన్యూ అధికారిడి.రామునాయక్ పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ హాల్లో ప్రజా పరిష్కార వేదిక కార్యక్రమం అనంతరం వెట్టి చాకిరి చట్టం 1976 రద్దు చేసి 50 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా అందుకు సంబంధించిన కరపత్రాల పోస్టర్లను డిఆర్ఓ ఆవిష్కరించారు. కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఉమామహేశ్వరి, జిల్లా కన్వీనర్ కరీముల్లా, కో కన్వీనర్లు ఫిలిక్స్, అక్బర్ భాష, న్యాయ సలహాదారులు సయ్యద్ అమీర్ భాష తదితరులు పాల్గొన్నారు.జిల్లా రెవెన్యూ అధికారి డి.రామునాయక్ మాట్లాడుతూ వెట్టి చాకిరి అనేది ఒక రకమైన బలవంతపు శ్రమ అని, దీనిలో ప్రజలు అప్పు తీర్చడానికి పని చేయవలసి వస్తుందన్నారు. ఇవి ప్రజలను దోపిడీ, పేదరికం మరియు నియంత్రణ అనే వలయాలలో చిక్కుకునేలా చేయడం జరుగుతోందన్నారు. వెట్టి చాకిరి, వ్యక్తుల స్వేచ్ఛను మరియు గౌరవాన్ని హరిస్తుందన్నారు. వెట్టి చాకిరిని పూర్తి స్థాయిలో కట్టడి చేయడానికి 1976లోనే దేశవ్యాప్తంగా వెట్టి చాకిరిని వ్యవస్థ నిర్మూలన చట్టం రద్దు చేసిందన్నారు. అప్పు తీర్చడానికి ఎవరినీ బలవంతంగా పని చేయమని ఒత్తిడి చేయించకూడదన్నారు. వెట్టి చాకిరి నేరాలు శిక్షార్హమైనవి, పోలీసు వారు ముందస్తు అనుమతి లేకుండానే కేసు నమోదు చేసి దర్యాప్తు చేసే అవకాశం ఉంటుందన్నారు. ఎవరైనా వెట్టి చాకిరిలో చిక్కుకుని ఉన్నారని మీరు అనుమానిస్తే, వెంటనే బాధ్యతాయుతంగా రెవెన్యూ డివిజనల్ అధికారి, మండల రెవెన్యూ అధికారి, జిల్లా మేజిస్ట్రేట్ లేదా కార్మిక శాఖ అధికారికి నివేదించాలన్నారు. అదే విధంగా ఇటువంటి పరిస్థితిని మార్చి అవగాహన పెంచి, ఇటువంటి నేరాలను పూర్తిగా నిర్మూలించడమే ప్రధాన లక్ష్యం అన్నారు. అందుకు వెట్టి చాకిరి కార్మికులను గుర్తించి తగిన చర్యలు తీసుకొని వారికి పునరావాసం కల్పించి, ప్రతీ వెట్టి చాకిరి కార్మికుడిని రక్షించేలా చర్యలు తీసుకుంటామన్నారు.

# మైనారిటీ విద్యార్థులకు ఉచిత శిక్షణ

**నీట్, ఈఏపీ సెట్ పరీక్షలకు 45 రోజుల శిక్షణ -మైనారిటీ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి**

**రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్**

**అమరావతి, ఫిబ్రవరి 09 (రిపబ్లిక్ న్యూస్) :**
రాష్ట్రంలో నీట్, ఈఏపీ సెట్ పరీక్షలకు హాజరయ్యే మైనారిటీ విద్యార్థుల కోసం ఉచిత శిక్షణ ఇచ్చేందుకు కూటమి ప్రభుత్వం ఏర్పాట్లు చేసిందని రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ తెలిపారు.సోమవారం అమరావతిలో విడుదల చేసిన ఒక ప్రకటనలో ఉచిత శిక్షణకు సంబంధించిన వివరాలను మంత్రి ఫరూక్ వెల్లడించారు. మైనారిటీ సంక్షేమ శాఖ నేతృత్వంలో, సెంటర్ ఫర్ ఎడ్యుకేషనల్ డెవలప్మెంట్ ఆఫ్ మైనారిటీస్ (సీఈడీఎం) ద్వారా మైనారిటీ విద్యార్థులకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. నీట్, ఈఏపీ సెట్ ల పోటీ పరీక్షల్లో ఉన్నతమైన మార్కులను సాధించి, మంచిర్యాంకులతో వైద్య, ఇంజనీరింగ్, వ్యవసాయ, ఫార్మా తదితర అండర్ గ్రాడ్యుయేషన్ ( యూజీ కోర్సులు) కోర్సుల్లో అడ్మిషన్ పొందేందుకు వీలుగా



మైనారిటీ విద్యార్థులకు ఉచిత శిక్షణ ఇవ్వబోతున్నట్లు తెలిపారు. ఉచిత శిక్షణను ఆన్ లైన్, ఆఫ్ లైన్ విధానాలలో 45 రోజుల పాటు అందించడం జరుగుతుందన్నారు.నీట్, ఈఏపీ సెట్ ల శిక్షణలో నిష్ణాతులైన అధ్యాపకుల చేత బోధనా తరగతులు నిర్వహించడం జరుగుతుందని మంత్రి ఫరూక్ తెలిపారు.ఈ అవకాశాన్ని మైనారిటీ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు సీఈడీఎం వెబ్ సైట్::
www.apcedmmwd.org లేదా విజయవాడ సీఈడీఎం కేంద్ర కార్యాలయం లో సంప్రదించాలన్నారు.అలాగే
cedmap2017@gmail.com,
ఫోన్ నెంబర్:0866-2970567,మొబైల్ నెంబర్ :73867 89966 సంప్రదించి పూర్తి వివరాలు తెలుసుకోవచ్చని మైనారిటీ మంత్రి ఫరూక్ తెలిపారు.

# రెవెన్యూ క్లినిక్స్ ద్వారా 164 అర్జీలు స్వీకరణ

**జిల్లా రెవెన్యూ అధికారి డి.రాము నాయక్**






**నంద్యాల, బ్యూరోఫిబ్రవరి, 09 (రిపబ్లిక్ న్యూస్)**భూసమస్యల నాణ్యతతో పరిష్కరించేందుకు రెవెన్యూ క్లినిక్స్ ఏర్పాటు చేయడం జరిగిందని వాటి ద్వారా 164 అర్జీలు స్వీకరించడం జరిగిందని జిల్లా రెవెన్యూ అధికారి డి.రాము నాయక్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్ ఆవరణంలో నిర్వహించిన రెవెన్యూ క్లినిక్స్ ద్వారా భూసమస్యలకు సంబంధించిన దరఖాస్తులను ప్రజల నుండి స్వీకరించారన్నారు.ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి డి.రాము నాయక్ మాట్లాడుతూ భూ సమస్యలను పరిష్కార నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ క్లినిక్స్ ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. వీటి ద్వారా భూ సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించే అవకాశం ఉంటుందన్నారు. రెవెన్యూ క్లినిక్స్ ద్వారా మొత్తం 164 అర్జీలు స్వీకరించగా, అందులో రెవెన్యూ, గ్రామ, వార్డు సచివాలయ సేవలకు సంబంధించినవి-5, అడంగల్ సవరణలకు సంబంధించినవి-29, చుక్కల భూముల క్రమబద్ధీకరణ, 22-ఎ భూముల కుసంబంధించినవి-16, అసైన్డ్ భూములు, భూఆక్రమణలకు సంబంధించినవి-35, రెవెన్యూ కోర్టు విచారణలు, ఆర్ఓఆర్‌కు సంబంధించినవి-28, సర్వే, రీ-సర్వేకు సంబంధించినవి-42, దేవాదాయ, వక్ఫ భూములకు సంబంధించినవి-9 దరఖాస్తులు వచ్చాయన్నారు. స్వీకరించిన అన్ని సమస్యలను ప్రత్యేక శ్రద్ధతో త్వరితగతిన పరిష్కరిస్తామని డిఆర్ఓ తెలిపారు.

# ఈశ్వర్ చల్లాకు జాతీయ సాహిత్య అవార్డు

## ప్రకాశం జిల్లా టంగుటూరు మండలం శివపరం గర్వకారణం





**ప్రకాశం బ్యూరో, ఫిబ్రవరి 8, (రిపబ్లిక్ న్యూస్):** ప్రకాశం జిల్లా టంగుటూరు మండలానికి చెందిన రచయిత, దర్శకుడు శివపరం ఈశ్వర్ చల్లా సాహిత్య రంగంలో చేసిన విశేష సేవలకు గాను మర్మం (రెడ్‌మూన్) చిత్రానికి జాతీయ సాహిత్య అవార్డు - బెస్ట్ డైరెక్టర్, రైటర్ అవార్డును హైదరాబాద్‌లోని ప్రసాద్ ల్యాబ్స్‌లో ప్రముఖ నటుడు, ప్రజాప్రతినిధి బాబు మోహన్ చేతుల మీదుగా అందుకున్నారు. ఈ సందర్భంగా ఈశ్వర్ చల్లాని శాలువాతో సత్కరించి, జ్ఞాపికతో పాటు ప్రశంసా పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన సాహిత్య, సినీ ప్రముఖులు ఆయనను ఘనంగా అభినందించారు. ఈ గౌరవం టంగుటూరు మండలానికి గర్వకారణంగా నిలిచింది.

# నంద్యాలలో ఘనంగా హజ్ యాత్రికుల వ్యాక్సినేషన్ మరియు మెడికల్ స్క్రీనింగ్ క్యాంప్

**ముఖ్యఅతిథిగా పాల్గొన్న నంద్యాల టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్**

**నంద్యాల, బ్యూరోఫిబ్రవరి 09 (రిపబ్లిక్ న్యూస్)**
నంద్యాల పట్టణంలోని నేషనల్ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో సోమవారం హజ్-2026 యాత్రికుల కోసం ప్రత్యేక వైద్య పరీక్షలు మరియు వ్యాక్సినేషన్ క్యాంప్ నిర్వహించబడింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హజ్ కమిటీ మరియు మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి హజ్ సొసైటీ జిల్లా అధ్యక్షులు మరియు నేషనల్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఎస్. ఇంతియాజ్ అహ్మద్ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నంద్యాల జిల్లా టీడీపి ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ హాజరై, యాత్రికులకు ఉద్దేశించిన వ్యాక్సినేషన్ ప్రక్రియను ప్రారంభించారు.ఈ సందర్భంగా హజ్ యాత్రికులను ఉద్దేశించి ఎన్ఎండి ఫిరోజ్ మాట్లాడుతూ హజ్ యాత్ర అనేది జీవితంలో ఒక పవిత్రమైన ఘట్టమని, యాత్రికులందరూ సౌదీ అరేబియాలో అత్యంత క్రమశిక్షణతో ఆరోగ్యంగా యాత్రను పూర్తి చేయాలని ఆయన కోరారు. అంతర్జాతీయ ఆరోగ్య నిబంధనల ప్రకారం వ్యాక్సినేషన్ తీసుకోవడం తప్పనిసరి అని, ఇది యాత్రికుల రక్షణ కోసమేనని ఆయన వివరించారు. ఈ దిశగా హజ్ కమిటీ చేస్తున్న కృషిని అభినందించారు. రాష్ట్ర ప్రభుత్వం మైనారిటీల సంక్షేమానికి కట్టుబడి ఉందని, హజ్ యాత్రికులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా విమాన ప్రయాణం నుంచి బస వరకు అన్ని ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. పవిత్రమైన మక్కా, మదీనా సందర్శన సమయంలో దేశం సుభిక్షంగా ఉండాలని, నంద్యాల జిల్లా ప్రజలందరూ




సుఖసంతోషాలతో ఉండాలని ప్రత్యేకంగా ప్రార్థించాలని ఆయన యాత్రికులను కోరారు.ఈ సందర్భంగా యాత్రికులను ఉద్దేశించి డాక్టర్ ఇంతియాజ్ అహ్మద్ మాట్లాడుతూ హజ్ యాత్రకు వెళ్లే అల్లాహ్ అతిథులకు సేవ చేయడం తమ విద్యాసంస్థలకు మరియు హజ్ సొసైటీకి దక్కిన గొప్ప గౌరవంగా భావిస్తున్నామని ఆయన తెలిపారు. నంద్యాల జిల్లా నుండి వెళ్లే ప్రతి యాత్రికుడికి అప్లికేషన్ ప్రక్రియ నుండి యాత్ర ముగిసి తిరిగి వచ్చే వరకు జిల్లా హజ్ సొసైటీ అన్ని విధాలా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. యాత్రలో వాతావరణ మార్పులను తట్టుకోవడానికి అంతర్జాతీయ నిబంధనల ప్రకారం ప్రతీ యాత్రికుడు తప్పనిసరిగా వ్యాక్సిన్ తీసుకోవాలని, ఆరోగ్య నియమాలను పాటించాలని ఆయన సూచించారు. ఈ క్యాంప్ విజయవంతం కావడానికి సహకరించిన ఆంధ్రప్రదేశ్ మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్ గారికి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులకు, వ్యాక్సినేషన్ సిబ్బందికి , ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎన్ఎండి ఫిరోజ్ గారికి ఆయన ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఏపీ స్టేట్ హజ్ కమిటీ సభ్యులు సూరి మన్సూర్ అలీ ఖాన్, హజ్ కమిటీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ షేక్ మహమ్మద్ గౌస్ పీర్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఆర్. వెంకటరమణ, జిల్లా ఇమ్మ్యునైజేషన్ ఆఫీసర్ డాక్టర్ సి. సుదర్శన్ బాబు, ప్రసన్న లక్ష్మి, నేషనల్ కాలేజీల సెక్రటరి రఫీ అహ్మద్, మౌలానా అబ్దుల్ హాదీ, మౌలానా మహబూబ్ బాషా, హాఫిజ్ షరీఫ్, షబ్బీర్, రఫీ , హజ్ కమిటీ ప్రతినిధులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

printed and published by B.Nagendra on behalf of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: BOJJANAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic144@gmail.com